నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఉత్తరాంధ్ర

విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం

సోమవారం 23-6-2025 పేజీలు: 12


# సుపరిపాలనలో నేడు తొలి అడుగు

- ఏడాది పాలనపై కూటమి ప్రభుత్వ సంబరాలు
- విశాఖ నుంచి భారీగా తరలి వెళ్లనున్న కూటమి ప్రజాప్రతినిధులు
- ఉత్తరాంధ్ర నుంచి అన్ని జిల్లాల కలెక్టర్ల పయనం
- రెండో ఏడాది లక్ష్యాలపై భారీ అంచనాలు
- తొలిసారి ప్రజాప్రతినిధులతో అధికార యంత్రాంగం


(మేజర్ న్యూస్, సిటీ బ్యూరో)



కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైన సందర్భంగా "సుపరిపాలనలో తొలి అడుగు" పేరిట ప్రత్యేక సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. సోమవారం సాయంత్రం రాజధాని అమరావతిలో ఈ కార్యక్రమం జరగనుంది. వెలగపూడి సచివాలయం వెనుక భాగంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై "సుపరిపాలనలో తొలి అడుగు" సమావేశాన్ని నిర్వహించనున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైన జూన్ 12వ తేదీనే ఈ కార్యక్రమం నిర్వహించాలని భావించినా.. అహ్మదాబాద్ సమీపంలో జరిగిన ఘోర విమాన ప్రమాదం దృష్ట్యా వాయిదా వేశారు. సోమవారం జరిగే సమావేశంలో ఏడాదిలో చేపట్టిన పాలనా సంస్కరణలు, తీసుకొచ్చిన మార్పులు, అందించిన సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి చేసిన కృషిని సమీక్షించుకునేలా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. వచ్చే నాలుగేళ్లలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చటంతో పాటు అభివృద్ధి లక్ష్యాలను ఎలా సాధించాలన్న అంశంపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నారు. అమరావతిలో జరిగే ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, హెచ్వోడీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలంతా బయల్దేరి వెళ్ళేందుకు సమాయత్తం అవుతున్నారు. సోమవారం ఉదయం విజయవాడ ఫ్లైట్ ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు...ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో కిక్కిరిసి ప్రయాణించనుంది. గత కొద్ది రోజులుగా యోగాంధ్ర కార్యక్రమం కోసం ఉత్తరాంధ్ర జిల్లాల ఉన్నతాధికారులంతా తీవ్రంగా శ్రమించారు. ఈ కార్యక్రమం నుంచి ఒక్క రోజు మాత్రమే విశ్రాంతి తీసుకుని తిరిగి సోమవారం మళ్లీ రాష్ట్ర స్థాయి సదస్సునకు సిద్ధపడుతున్నారు.

## కూటమి పాలనలో యువతకు వెన్నుపోటు

- నేడు కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి
- ధర్మాన కృష్ణదాస్ పిలుపు



**నరసన్నపేట జూన్ 22, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యువత భవిష్యత్తు అంధకారంలో నెట్టి వేయబడిందని వైయస్ఆర్సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తీవ్ర విమర్శలు చేశారు. వైయస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు రేపు అనగా ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని శ్రీకాకుళంలో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల ముందు యువతను మభ్యపెట్టే మోసపూరిత వాగ్దానాలు చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్‌లు... అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు... నిరుద్యోగ భృతిగా నెలకు రూ.3 వేలు అందిస్తామన్నారు... కానీ అధికారంలోకి రాగానే అన్ని మాటలు నీరుగార్చారు. మోసం చేసిన నేతలు యువత మనోభావాలకు తూట్లు పొడిచారని ధర్మాన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోతే వెనక్కి తగ్గేది లేదని, పోరాటం ముదిరేంతవరకూ వైయస్ఆర్సీపీ వెనక్కి తగ్గదని హెచ్చరించారు. జిల్లావాప్తంగా ప్రతి నియోజకవర్గం నుంచి యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మోసం చేయడంలో బాబు గిన్నీస్ రికార్డు



- నేడు వైయస్ఆర్సీపీ యువతపోరు
- జిల్లా కలెక్టరేట్ ముందు శాంతియుత నిరసనలు
- మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ వెల్లడి

**విశాఖపట్నం , జూన్ 22, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో యువతకు ఇరవై లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగభృతి అంటు వాగ్ధానాలు చేసి అధికార పీఠాన్ని చేపట్టిన వెంటనే విస్మరించిన చంద్రబాబు మోసాన్ని ప్రశ్నిస్తూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా వైయస్ఆర్సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్ వెల్లడిరచారు. వైయస్ఆర్సీపీ విశాఖ నగర పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువత అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద శాంతియుతంగా నిరసనలు చేసి, తమ డిమాండ్ పత్రాలను కలెక్టర్‌లకు అందచేస్తామన్నారు. ఏడాది కాలంగా నిరుద్యోగభృతి అమలు చేయకుండా, మరోవైపు కొత్త ఉద్యోగాల భర్తీని గాలికి వదిలేసిన (తరువాయి 2వ పేజీలో)




**విశాఖపట్నం, మేజర్‌న్యూస్:** గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ నాల్గవ జోన్ పరిధిలోని పాతనగరం అక్రమకట్టడాలకు అడ్డాగా మారింది. జోన్ పరిధిలోని దాదాపు అన్ని వార్డుల్లో భారీగా అక్రమ కట్టడాలున్నాయి. జోన్‌లోని నిభందనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నా.. రహదారులు, కాలువలు ఆక్రమించి భవనాలు కట్టేస్తున్నా జీవీఎంసీ అధికారులు చూసిచూడనట్టు వ్యవ హరిస్తున్నారు. ఫలితంగా కొంత మంది బిల్డర్స్ అడ్డగోలుగా ప్లాట్‌లు వేసి విక్రయాలు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రతి వార్డులో నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మాణమవుతున్నాయి. ప్రధాన రహదారుల్లో అయితే మరీను. అయితే టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అండదండలతోనే భవనాలు నిర్మితమవుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి ఏద్కెనా భవనం నిర్మించాలంటే నగర ప్రణాళిక విభాగం అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. అయితే అనుమతులు లేకుండా చాలా భవనాలు నిర్మిస్తున్నారు. అదనపు అంతస్తులు ఏర్పాటు చేస్తున్నారు. మూడు అడుగులు లేని రహదారిలో సైతం మూడు అంతస్తులు భవనాలు నిర్మితమవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నిభందనలకు విరుద్ధంగా నాలుగు, ఐదు అంతస్తుల భవనాలు కూడా నిర్మిస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడి నగర ప్రణాళిక విభాగం అక్రమ నిర్మాణాలను చూసిచూడనట్టు వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి వార్డులోనూ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శుల కనుసైగలలో ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి. కొంతమంది సచివాలయ, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది భవన యజమానుల వద్దకు వెళ్ళి బేరసారాలు నడుపుతూ అధికారులకు, (తరువాయి 2వ పేజీలో)

## ప్రపంచ రికార్డులను బ్రేక్ చేసిన విశాఖ యోగా



- యోగా వేడుక సరికొత్త రికార్డు అంటూ ప్రశంసలు
- ఈ రికార్డు ప్రతీ ఆంధ్రునికీ గర్వకారణమన్న సీఎం చంద్రబాబు
- ఎక్స్‌లో ట్వీట్ చేసిన మంత్రి లోకేష్

**విశాఖపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్ :** విశాఖలో శనివారం నిర్వహించిన 11వ యోగా అంతర్జాతీయ దినోత్సవం ప్రపంచ రికార్డులు బ్రేక్ చేసింది. ఈ యోగా వేడుకలు (తరువాయి 2వ పేజీలో)

(మొదటి పేజీ తరువాయి)

## విశాఖ పాత నగరంలో అక్రమ కట్టడాలు

ఆపై అధికారులకు ముడుపులు సమర్పిస్తుండటంతో గుట్టుచప్పుడు కాకుండా నిర్మాణాలు జరుగుతున్నాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో కూడా టౌన్‌ప్లానింగ్ విభాగంలో లంచం తీసుకుంటూ దొరికిన నగర ప్రణాళిక విభాగ ఉద్యోగులు ఉన్నారు. అవినీతి నిరోదక శాఖ దాడులకు చిక్కిన అధికారులు ఉన్నారు. అయినప్పటికీ అధికారుల తీరులో ఎలాంటి మార్పు రావడం లేదు. వాస్తవానికి భవిష్యత్ అవసరాలను, ప్రజల రక్షణను దృష్టిలో ఉంచుకుని భవన నిర్మాణాల్లో నగర ప్రణాళిక విభాగం నిభందనలు పెట్టింది. ప్రణాళిక విభాగం నిభందనలు ప్రక్కన పెట్టి అక్రమ కట్టడాలు కట్టడం వలన ప్రజలకే నష్టం వాటిల్లుతుంది. కొన్నేళ్ళ క్రితం అక్కయ్యపాలెంలో ఒక ఇంటిలో బారీగా ఉంచిన దీపావళి బాణసంచా పేలుడు కారణంగా భవనం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో కొంతమంది చనిపోయారు. వారి మృతదేహాలు తీయడం చాలా కష్టమైపోయింది. శిధిలాల్లో చిక్కుకున్నవారిని రక్షించలేని పరిస్థితి ఏర్పడిరది.పరిస్థితి చక్కదిద్దడానికి రేయింబవళ్ళు అధికారులు, సిబ్బంది శ్రమించాల్సి వచ్చింది. నిభందనలకు విరుద్దంగా సంఘటన జరిగిన భవనం నిర్మించడం కారణంగానే క్షతగాత్రులను బయటకు తీయలేకపోయారని అంతా అన్నారు. పూర్ణామార్కెట్ ప్రాంతంలోని గ్యాస్ సిలెండర్ పేలినప్పుడు కూడా అడ్డగోలు నిర్మాణం కారణంగా ఇబ్బందులు ఎదురైయ్యాయి. ఇటువంటి సంఘటనలు జరిగినా అటు యజమానుల్లోనూ, ఇటు నగర ప్రణాళిక విబాగం అధికారుల్లోనూ మార్పు రాకపోవడం దారుణం. ఏదేమైనప్పటికీ అధికారులు స్పందించి అక్రమకట్టడాలకు, అదనపు అంతస్తులకు చెక్ చెప్పాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## విశాఖ యోగా బ్రేక్

సరికొత్త రికార్డు సృష్టించిందంటూ గిన్నీస్ వరల్డ్ రికార్డ్ ప్రశంసలు కురిపించింది. గిన్నీస్ వరల్డ్ రికార్డ్ పోస్ట్‌పై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ స్పందించారు. యోగా దినోత్సవ వేడుకల్లో 3 లక్షల 105 మంది పాల్గొని సరికొత్త రికార్డ్ సృష్టించారంటూ గిన్నీస్ వరల్డ్ రికార్డ్ ప్రశంసలు కురిపించింది. ఈ సందర్భంగా చంద్రబాబు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఆదివారం పోస్టు చేశారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లలో విశాఖ యోగాకు స్థానం దక్కడం ప్రతి ఒక్క ఆంధ్రుడుకు గర్వ కారణమని అన్నారు. ఈ రికార్డ్ ఏపీలో ఉన్న ప్రతి ఒక్కరికీ దక్కుతుందని అన్నారు. 'మీరందరు చూపించిన అంకితభావం అందరిలో స్ఫూర్తిని నింపింది. ఒక మంచి పని కోసం అందరం కలిసి పనిచేస్తే ఇటువంటి ఫలితాలు సాధించవచ్చని నిరూపించాం.. అందరికీ అభినందనలు' అంటూ సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ప్రపంచ రికార్డులను ఆంధ్రప్రదేశ్ బ్రేక్ చేసి సరికొత్త చరిత్ర సృష్టించిందని, బ్రాండ్ విశాఖ వేదికగా ఈ ఘనతను సాధించామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఈ విజయంలో భాగస్వాములైన తెలుగుదేశం నాయకులు, శ్రేణులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. వేడుకను విజయవంతంగా నిర్వహించిన ప్రభుత్వ అధికారులు, ఈ అద్భుతమైన ఘనతను సాధించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలంటూ మంత్రి లోకేష్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. విశాఖ యోగాకు గిన్నిస్ బుక్‌లో స్థానం దక్కడం గర్వకారణమని.. 3,00,105 మందితో ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా విశాఖలో యోగా నిర్వహించి రికార్డ్ నమోదు చేశామన్నారు. ఏపీ ప్రభుత్వం నిర్వహించిన ఈ యోగాను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో పేర్కొన్న ఆ సంస్థ ట్వీట్‌ను మంత్రి నారా లోకేష్ రీట్వీట్ చేశారు. వరల్డ్ రికార్డ్ సొంతం చేసుకోవడానికి కారకులైన వారందరికీ మంత్రి లోకేష్ మరొక్కసారి కృతజ్ఞతలు తెలిపారు

## బాబు గిన్నీస్ రికార్డు

కూటమి ప్రభుత్వ మెడలు వంచి నిరుద్యోగులకు న్యాయం చేసే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. ఇంకా ఆయనేమన్నారంటే ...రాష్ట్రంలో కోటికి పైచిలుకు నిరుద్యోగులు ఉన్నారు. అయిదేళ్ళలో ఇరవై లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అప్పటి వరకు నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగభృతి కల్పిస్తానని కూడా హామీ ఇచ్చారు. ఈ ఏడాది కాలంలో ఆయన కల్పించిన ఉద్యోగాలు సున్నా. అలాగే నిరుద్యోగులకు ఇచ్చిన భృతి కూడా సున్నానే. దీనిని ప్రశ్నిస్తూ సోమవారం వైయస్‌ఆర్‌సీపీ ఆధ్వర్యంలో యువతపోరు పేరుతో వైయస్‌ఆర్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతున్నాం. పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో యువత పాల్గొని తమ ఆగ్రహాన్ని ఈ ప్రభుత్వానికి అర్థమయ్యేలా చేస్తుంది. ఉద్యోగాల కల్పనపై మాట మార్చిన సీఎం చంద్రబాబు నేడు నిరుద్యోగభృతిని స్కిల్ డెవలప్‌మెంట్‌కు లింక్ చేశామంటున్నారు. అలాగే మహిళలకు ఇచ్చిన హామీని పీ4కి లింక్ చేశాం కాబట్టి దానిని కూడా అమలు చేసేసినట్లేనని చంద్రబాబు అడ్డంగా మాట్లాడుతున్నారు.

### యోగాంధ్రా పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టారు

యోగాతో అందరి ఆరోగ్యం బాగుండాలనే తనపతో కేంద్రం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవాలని పిలుపునిచ్చింది. ఏపీ ప్రభుత్వం దీనిని రూ.300 కోట్లు ఖర్చు చేసి ఒక భారీ ఈవెంట్ కింద నిర్వహించడం ద్వారా తమ ప్రచార యావను మరోసారి చాటుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజలను, విద్యార్ధులు, మహిళలను తీవ్రంగా ఇబ్బందుల పాలు చేశారు. ప్రతిసారీ ఇటువంటి ఈవెంట్ తరహా కార్యక్రమాలకు చంద్రబాబు ఎందుకు ఇష్టపడతారంటే, తీవ్రమైన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకేనని ఎవరికైనా అర్థమవుతుంది. గత ఏడాది కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుడు హామీల అమలుకు ఏ మేరకు చర్యలు తీసుకుంటోంది, ప్రజలకు ఏ రకంగా మేలు చేసేందుకు కృషి చేస్తోందనే దానిపైన వారికి ఆసక్తి లేదు. ఇటువంటి పబ్లిసిటీ ఈవెంట్స్ నిర్వహించడం, గిన్నిస్‌బుక్‌లో ఎక్కామా, దానిని ఎలా ఫోకస్ చేసుకోవాలనే దానిపైనే చంద్రబాబు దృష్టి అంతా. ప్రజలను మోసం చేయడంలో ఆయన ఎప్పుడో గిన్నీస్ రికార్డ్సును సొంతం చేసుకున్నారు. ఆయన మీద ఉన్న అనేక కేసుల్లో స్టేలు తెచ్చుకుని, విచారణను అడ్డుకుంటున్నందుకు గిన్నీస్ బుక్ రికార్డ్ సాధించారు. ఏడాది కాలంలో ఏకంగా రూ.1.59 లక్ష కోట్లు అప్పులు చేసినందుకు చంద్రబాబుకు గిన్నీస్ రికార్డ్ ఇవ్వాలి. ఈ రాష్ట్రంలో సూపర్ సిక్స్ అమలును అటకెక్కించేశారు. ఏ ఒక్క పథకాన్నీ పూర్తిగా అమలు చేయకుండా మోసం చేస్తున్నారు. చివరికి తల్లికి వందనం పథకాన్ని కూడా ఇదే తరహాలో అరకొరగా అమలు చేసి, చేతులు దులిపేసుకున్నారు.

### ఉత్తరాంధ్రకు ఏడాది కాలంగా ఏం చేశారు?

ఉత్తరాంధ్రకు ఈ ఏడాది కాలంలో చంద్రబాబు చేసిన మేలు ఏమిటో చెప్పాలి. ప్రతిసారీ ఏదో ఒక ఈవెంట్‌కు విశాఖను కేంద్రంగా చేసుకుని, ఆర్భాటం చేయడం తప్ప. ఒకవైపు స్టీల్‌ప్లాంట్ పూర్తిస్థాయిలో ప్రైవేటీకరణ వైపు నడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోదు. కార్మికులు ఆందోళనలు చేస్తుంటే, పోలీసులతో వారిని బెదిరించారు. ప్లాంట్‌లోని కాంట్రాక్ట్ కార్మికులకు రూ.వేల కోట్లు బకాయిలు పెట్టారు. రాష్ట్రానికి సంబంధించి ప్రయోజనాలను పూర్తి విస్మరించడం వల్లే ప్రజలు ఏడాదిలోనే విసిగిపోయారు. అందుకే ప్రతిపక్ష నేత వైయస్ జగన్ పర్యటనలకు పెద్ద ఎత్తున అభిమానంతో మద్దతు పలుకుతున్నారు. దీనిని కూడా ఓర్వలేక ఆయన పర్యటనలను పూర్తిగా అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్నారు.

## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పంచకర్ల




**విశాఖపట్నం , జూన్ 22, మేజర్‌న్యూస్ :** సింహాచలం ఆర్టీసీ డిపో ఎదురుగా ఆర్ ఆర్ ఫంక్షన్ హాల్ లో నవయుగ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్స్ అందజేసి పదవ తరగతి ఫలితాలలో గవర్నమెంట్ స్కూల్లో చదివి ప్రతిభ చూపించిన విద్యార్థిని సత్కరించి ఉన్నత చదువుకు ఆర్థిక సహాయం అందజేసి ఇటువంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసిన జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు శ్రీ పంచకర్ల రమేష్ బాబు గారు వీరితోపాటు 98వ అధ్యక్షులు మజ్జి సూరిబాబు గారు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శంకర్ రావు గారు, అయితే సింహాచల నాయుడు గారు, నవయుగ సేవా సంఘం సభ్యులు మరియు సింహాచలం ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .

# సీఎం చంద్రబాబుపై కేకే రాజు ఫైర్

**విశాఖపట్నం , జూన్ 22, మేజర్‌న్యూస్ :** విశాఖపట్నం, మద్దిలపాలెం , కృష్ణ కాలేజ్ రోడ్డులో గల పార్టీ కార్యాలయంలో ఆదివారం జిల్లా పార్టీ అధ్యక్షులు కె. కె.రాజు సమావేశం ర్వహించారు. ఈ సందర్భంగా కెకె రాజు గారు మాట్లాడుతూ... మా నాయకుడు జగన్ తల నరుతామంటూ ఏకంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అంటున్నారు. అధికార మదంతో అన్న మాటలు కావివి. కావాలనే కుట్ర పన్నుతున్నారు. సినిమా డైలాగ్ ఫ్లెక్సీ అంశాన్ని ఒక పథకం ప్రకారం ముందుకు తీసుకెళ్లి.. ఆముసుగులో జగన్గారికి వ్యతిరేకంగా ఆయనమీద కుట్రకు తెరలేపారన్నది కచ్చితంగా కనిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ, మీడియా కలిసి.. వేసిన పథకం ఇది. ఈ ప్రచార హోరులో ఏం జరిగినా? దాన్ని ఈ రకంగా మూసివేయాలన్నది ప్లాన్. వెంటనే బుచ్చయ్య చౌదరిని అరెస్టు చేయండి? జగన్ మీద మీకున్న ద్వేషాన్ని, ఆయన్ని లేకుండా చేసేయాలన్న మీ తాపత్రయం, ఆరాటం, కుట్ర దీన్ని ప్రజలకు అర్థం అవుతుంది. ఆయన అడ్డే లేకపోతే.. ఇక రాష్ట్రాన్ని మొత్తం స్వాహా చేయొచ్చని మీ ప్లాన్. లక్షలమంది అభిమానం జగన్గారికి ఉంది, మీరు, మీ పోలీసులు భద్రత ఇవ్వకపోయినా... వాళ్లే ఆయన్ని కాపాడుకుంటారు. ఆ విషయం గుర్తించండి. ఉద్దేశ పూర్వకంగా ఆయనకున్న సెక్యూరిటీని తగ్గించారు. జిల్లాల్లో పర్యటనలకు వెళ్తున్నప్పటికీ సెక్యూరిటీని ఇవ్వడంలేదు. పైగా టీడీపీ శక్తులతో ఆయన పర్యటనల్లో హింసను కావాలనే రేకెత్తించడానికి ప్రయత్నిస్తున్నాడు. పొదిలిలో జరిగింది ఇదే. నిన్న పల్నాడు జిల్లాలో కూడా కావాలనే ఫ్లెక్సీ వివాదాన్ని లేపారు. టీడీపీ కార్యకర్త ఈఫ్లెక్సీని చూపాడు. దాన్ని అడ్డంపెట్టుకుని వెంటనే టీడీపీ ఆఫీసులో రామానాయుడు ప్రెస్మీట్ పెట్టడం, తర్వాత దానిచుట్టూ



ప్రచారం చేయడం, ఇవాళ జగన్ గారి తలనరకాలంటూ బుచ్చయ్య చౌదరి కామెంట్ చేయడం. మరోవైపు సీఎం మాటలు కూడా అత్యంత దారుణంగా ఉన్నాయి. భూస్థాపితం చేస్తాడట!. రెడ్బుక్ రాజ్యాంగ పాలన ఏమిటి? బెదిరింపులేమిటి? వాడ్ని తొక్కుతా. వీడ్ని తొక్కుతా.. అన్న మాటలేమిటి?ఎవరైనా ప్రశ్నిస్తే భూస్థాపితం చేస్తాను అనే మాటలు అత్యంత హేయం.ఎవరు గళం విప్పినా ఒప్పుకోం. ఎవరూ గళం విప్పకూడదనే ఉద్దేశంతో తప్పుడు కేసులు పెడుతున్నారు. టాపిక్ లు డైవర్ట్ చేస్తున్నారు. ప్రజలకు వెన్నుపోటు పొడవడం తప్ప చంద్రబాబుగారు చేస్తున్నారు? మీ సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలపై జగన్గారి ప్రశ్నలకు సమాధానం ఏదీ? రైతు భరోసా గత ఏడాది ఎగ్గొట్టావు. ఇప్పటికే ఖరీఫ్ స్టార్ట్ అయ్యింది. ఎప్పుడిస్తావు? పంటల బీమా డబ్బులు ఎప్పుడు ఇస్తావు? ఆడ బిడ్డ నిధి ఎప్పుడు ఇస్తావు? నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తావు.? వీటికి సమాధానం చెప్పడానికి మీకు ధైర్యం లేదు? అధికారంలోకి రాగానే జూన్ నుంచి ప్రతి ఇంటికీ... ఇచ్చిన వాగ్దానాలమేరకు డబ్బు జమచేస్తామని ఇచ్చిన బాండ్లు గురించి మాట్లాడరు? ఫీజపు రియింబర్స్మెంట్ బకాయిల గురించి మాట్లాడరు? వసతి దీవెన గురించి మాట్లాడరు? పడకేసిన ఆరోగ్య శ్రీ గురించి మాట్లాడరు? రద్దుచేసిన ఉచిత పంటల బీమా గురించి మాట్లాడరు? గత ఏడాది ప్రజలకు ఎగవేసిన రూ.80వేల కోట్ల గురించి మాట్లడరు? పీకేసిన మూడు లక్షలకుపైగా ఉద్యోగాల గురించి మాట్లాడరు? ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ.30వేల బకాయిలు, డీఏల గురించి మాట్లాడరు?ఇళ్ల నిర్మాణం గురించి మాట్లాడరు? ఇసుక, మట్టి, లిక్కర్, మైనింగ్ మాఫియాల గురించి మాట్లాడరు?కాని, ప్రతి విషయాన్ని వక్రీకరించి.. సభ్యత మరిచి మాట్లాడతారు? కాని జగన్ గారి టూర్లో ఒకరు సినిమా డైలాగ్ పోస్టర్ చూపితే, అదేదో పెద్ద అన్యాయం జరిగిపోయినట్టుగా మాట్లాడుతున్నారు. పుష్ప-2 డైలాగు చూపిస్తే.. మీకెందుకు అంట మంట? వీటికి మూలాలు సినిమా డైలాగులే కదా? సినిమా డైలాగుల్లో అలాంటి లేకుండా చేయండి?డపోయిట్టు ఉన్నారు. వాస్తవానికి ఈ రాష్ట్రంలో రక్తం పాతం సృష్టిస్తున్న దెవరు. మీరు ఎన్నికల సమయం దగ్గరనుంచి మీ కారణంగా పల్నాడు సహా రాష్ట్రంలో పెట్టిన హింసా జ్వాలా ఇంకా రగులుతూనే ఉంది. మీ రెడ్ బుక్ కారణంగా, మీ పచ్చబిళ్లల సిద్ధాంతం కారణంగా... పారుతున్న హింస అంతా ఇంతా కాదు.. ఈ విషయం అందరికీ తెలిసిందే.వైయస్సార్సీపీ నాయకులమీద హత్యలు, హత్యాయత్నాలు 766 . వీరిలో హత్యకు గురైనవారు 390 దాడులు, హత్యాచారాలకు గురైన చిన్నారు 203 వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు 2,466 సోషల్ మీడియా యాక్టవిస్టుల మీద కేసులు 729 రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఏడాదిలోనే రూ.1,61,301 కోట్ల అప్పులు చేసి రికార్డు సృష్టించారని కేకే రాజు తెలిపారు.




## నూతనంగా ఎన్నుకోబడిన పాల సొసైటీ



**సబ్బవరం, జూన్ 22, మేజర్‌న్యూస్:** సబ్బవరం మండలం అసకపల్లి పంచాయతీ నక్కవాని పాలెం పాల ఉత్పత్తి సంస్థ పాల సొసైటీ నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్షులను, డైరెక్టర్లను, ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావు వారిని సాలువ కప్పి సన్మానించడం జరిగింది. అసకపల్లి గ్రామ పంచాయితీ సర్పంచ్ కర్రి నరసింగరావు ఆధ్వర్యంలో పాలు సొసైటీ అధ్యక్షులుగా "తమనాల సూరిబాబు "ఎన్నికయ్యారు.

__డైరెక్టర్లు:__ నక్క తాతారావు, నోట్ల అప్పారావు, రేసిపూడి లక్ష్మణరావు, కర్రీ బంగారు నాయుడు, మామిడి ముత్యాల నాయుడు, చిన్ని అప్పారావు, చిన్ని వెంకనాయుడు ఎన్నికయ్యారు.

## వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఉదయాస్తమాన సేవలు



**రావికమతం, జూన్ 22, మేజర్‌న్యూస్:** మండలంలో కొత్తకోట.వాసవి వనితా క్లబ్ ఉదయాస్తమాన సేవలు లో భాగంగా ఆదివారం వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. మెయిన్ రోడ్డు ఏర్పాటు చేసిన ఉచిత డయాబెటిస్ పరీక్ష లలో 220 మందికి పరీక్షలు నిర్వహించారు.. అలాగే పెనుగొండ సన్యాసి శెట్టి ఇంటి ఆవరణలో వాసవి వనితా క్లబ్ అధ్యక్షులు పెనుగొండ శోభా రాణి ఆధ్వర్యంలో స్థానిక చర్మకారుడు మంజేటి రమణ కు 12 రకాల నిత్యావసర సరుకులు, గొడుగు ఉచితంగా అందజేశారు., నిరుపేద రైతు కోట అప్పారావు తో పాటు మాజీ సైనిక ఉద్యోగి మిలట్రీ రమణ లను ఘనంగా సత్కరించి దుస్తులు అందజేశారు స్థానిక ప్రాథమిక పాఠశాల కు పివిసి వాటర్ ట్యాంక్ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో వాసవి క్లబ్ ఇంటర్ నేషనల్ సభ్యులు కందుల నాగరాజు, మరో సభ్యురాలు పి వి నాగజ్యోతి,స్థానిక వాసవి, వనితా క్లబ్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

## ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహకారంతో మజ్జిగ పంపిణీ




**పాయకరావుపేట, జూన్ 22, మేజర్‌న్యూస్:** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పాయకరావుపేట ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహకారంతో 75వ రోజు మజ్జిగ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ప్రింట్ మీడియా సెక్రటరీ దాసరి శ్రీనివాస్,సీనియర్ పాత్రికేయులు ఏపీయూడబ్ల్యూజే మాజీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ గెద్దాడ వెంకట దుర్గాప్రసాద్,మాజీ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెసిడెంట్ కుందూరు రానా, విలేకరులు కే.జ్యోతి రాజు,కె.నాగార్జున,జి.శివప్రసాద్, గణేష్, రాము,కన్నా,యర్ర శ్యామ్,వెలగా ప్రసాద్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ బాలేపల్లి చినబాబు,టెక్కలి వెంకట రామకృష్ణ, వెలుగుల అర్జున్ రావు తదితరులు విలేకరులకు షీల్డ్ లు అందించారు.

## నాలుగవ రోజుకు చేరిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల ధర్నా




**నర్సీపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** ఈనెల 19 నుండి నర్సీపట్నం మున్సిపాలిటీ ఇంజనీరింగ్ కార్మికులు నర్సీపట్నం సబ్ కలెక్టర్ ఆఫీస్ ఎదుట చేపడుతున్న ధర్నా కార్యక్రమం నాలుగవ రోజుకు చేరుకుంది. ఆదివారం కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని విన్నూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ, 13వేల చాలీచాలని జీతంతో కుటుంబ పరిస్థితులు భారంగా మారాయని, మున్సిపాలిటీలోని ఇతర శాఖల కార్మికులకు మాదిరిగానే తమకూ పనికి తగ్గ వేతనం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గత కొద్ది రోజులుగా నిరసనలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించలేదన్నారు.ఈరోజు అర్ధరాత్రి నుండి రాష్ట్రవ్యాప్త సమ్మెకు నాయకులు పిలుపునిచ్చారని, ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోతే తాము కూడా సమ్మెకు సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల సంఘం (జేఏసీ) జిల్లా అధ్యక్షుడు గొర్లె మురళీకృష్ణ, కార్యదర్శి కరక మహేష్, నర్సీపట్నం శాఖ అధ్యక్షుడు మాకిరెడ్డి అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు కరక రామకృష్ణ, యర్రా ప్రకాష్, కోశాధికారి లాలం నాగేంద్ర, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## యువత పోరు కార్యక్రమంలో అందరూ పాల్గొవ్వాలి



**అచ్చుతాపురం, జూన్ 22, మేజర్‌న్యూస్:** అచ్చుతాపురం మండలం విద్యార్థులు, యువత నిరుద్యోగులు విన్నపం మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ పార్టీ అధినేత వైయస్ జగన్ మరియు యలమంచిలి నియోజకవర్గం ఇంచార్జి కన్నబాబు ఆదేశాల మేరకు నియోజకవర్గం యువజన అధ్యక్షులు సియాద్రి బుజ్జి నాగ సూకరాజు ఆధ్వర్యంలో విద్యార్థి, యువజన విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23 తేదీన ఉదయం 10:00 అనకాపల్లి జిల్లా లికలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమము వుంది కాబట్టి విద్యార్థులు. నిరుద్యోగులు. పార్టీ కేడర్. పార్టీ నాయకులు ఎక్కువ మంది వచ్చి ఈ ధర్నా కార్యక్రమం ను విజయవంతం చేస్తరు అని కోరుచున్నాము.

## రగ్బీ క్రీడా శిక్షణ ముగింపు కార్యక్రమం



**అచ్చుతాపురం, జూన్ 22, మేజర్‌న్యూస్:** అనకాపల్లి జిల్లా అచ్యుతపురం మండలం భోగాపురం క్రీడ మైదానం లో జరిగిన వేసవి రగ్బీ క్రీడా శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమాన్ని కోచ్ వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిల్లలు తల్లిదండ్రులు విచ్చేసి విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మెడి రైస్ హాస్పిటల్ డాక్టర్ జగదీష్ శ్రీ విష్ణు హాస్పిటల్ డాక్టర్ సుధీర్ మండలం బిజెపి అధ్యక్షులు కూండ్రపు నాయుడు బాబు పిల్లలు ఉద్దేశించి మాట్లాడుతూ ఈ క్యాంపులో నేర్చుకున్న క్రీడ మెలకువలను నిత్యం ఆచరించి, క్రీడ మైదానంలో నిరంతరం శ్రమించి గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయికి వెళ్లి మన జిల్లాకి మన రాష్ట్రానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.. అనంతరం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నుంచి వచ్చిన ధ్రువీకరణ పత్రం , అందజేసి, ఈ రగ్బీ కెంపులో ఉత్తమ ప్రదర్శన కనపరిచిన క్రీడాకారులకు పథకాలు, బహుమతులు, బహూకరించారు...

## పల్లా సేవలు మరవలేనివి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్



**అచ్చుతాపురం, జూన్ 22, మేజర్‌న్యూస్:** కీర్తిశేషులు పల్లా సింహాచలం సంతాప సభలో పాల్గొన్న ఎలమంచిలి నియోజవర్గం ఎమ్మెల్యే సుందరపు విజయక కార్మిక బంధు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత మాజీ శాసనసభ్యులు సింహాచలం గారి సేవలు మరువలేనివి కార్మిక బంధు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత మాజీ శాసనసభ్యులు కీర్తిశేషులు పల్లా సింహాచలం సేవలు మరువలేనివని ఎలమంచిలి నియోజవర్గం.ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. నిరంతరం ప్రజా క్షేత్రంలో ఉంటూ , ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన ఉన్నత వ్యక్తిత్వం గల మంచి మనిషి అని కొనియాడారు. యాదవ కుల అభివృద్ధి కొరకు ఎంతో శ్రమించారని గుర్తుచేశారు. సమాజంలో తన లాంటి ఎంతో మందికి ఆదర్శం అని తెలిపారు. టిడిపి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లాతో కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే లు, జనసేన టిడిపి నాయకులు.పాల్గొన్నారు.

## బాడంగి-ముగడ-బొబ్బిలి రహదారికి మరమ్మతులు చేయండి



**బాడంగి, జూన్ 22, మేజర్ న్యూస్:** బాడంగి వయా ముగడ గ్రామం మీదుగా బొబ్బిలికి వెళ్లే రహదారిలో బాడంగి నుండి జే రంగరాయపురం బ్రిడ్జ్ వరకు రహదారికి మరమ్మతులు చేయాలని వాహనదారులు ప్రజలు కోరుచున్నారు తరచూ ప్రయాణించే వాహనదారులు రహదారి మలుపులు వద్ద ఉన్న గుంతలు కొట్టిన రోడ్డు మూలంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు గతంలో కేంద్ర మంత్రిగా ఉన్న అశోక్ గజపతి రాజు ముగడ గ్రామంను దత్తత తీసుకొని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయడం లో భాగంగా ప్రస్తుత బొబ్బిలి బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు ఆనాడు కృషి ఫలితంగా అశోక్ గజపతి రాజు ద్వారా ఈ రహదారికి మోక్షం కలిగించారు అంతేకాకుండా తెంటులక్ష్మ నాయుడు గతంలో విజయనగరం జిల్లా ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ చైర్మన్ గా ఉండేటప్పుడు ఈ ప్రాంత ప్రజలు విద్యార్థుల మనోభావాలను అర్థం చేసుకొని ఈ రహదారి మీదుగా బస్సు సౌకర్యం కూడా కల్పించారు అటువంటి ఈ ముఖ్యమైన ఈ రహదారి ద్వారా అనేక గ్రామాల ప్రజలు దైనందిన కార్యకలాపాల కోసం బొబ్బిలి తరచుగా వెళ్తుంటారు. వ్యాపార అవసరాలు, విద్యార్థుల ప్రయాణం, అత్యవసర ఆరోగ్య సేవలు అన్నీ ఈ రహదారిపైనే ఆధారపడిన పరిస్థితి కావున సంబంధిత అధికారులు తక్షణం స్పందించి ఈ రహదారి పూర్తిగా శిథిల అవస్థకు చేరకముందే ప్రజలు కోరుకుంటున్న విషయం ఏదైనా ఆలస్యంగా కాకుండా వెంటనే ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

## జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యం కావాలి

### దిశా నిర్దేశం చేసిన జనసేన పార్టీ నేత నాగబాబు



**పూసపాటిరేగ, జూన్ 22, మేజర్ న్యూస్:** జనసేన పార్టీ అభివృద్ధికి మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని జనసేన నేత, ఎమ్మెల్సీ అయిన కొణిదెల నాగబాబు నాయకులకు దిశా నిర్దేశం చేశారు. నీళ్ల మరి నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులతో జనసేన నేత కొణిదెల నాగబాబు భోగాపురం సన్రైజ్ రిసార్ట్లో ఆదివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ గ్రామ గ్రామాన జనసేన పార్టీ బలోపేతం కావాలని, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లక్ష్యాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధికి చేపడుతున్న సంక్షేమ, ప్రగతి కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతకుముందు జనసేన నాయకులు కోట్ల రఘు, బాల అప్పలరాజు కొణిదల నాగబాబును ఘనంగా సత్కరించారు.

## బస్సులో పోగొట్టుకున్న నగదు అందజేత

**రామభద్రపురం, జూన్ 22, మేజర్ న్యూస్:** వైజాగ్ నుంచి రామభద్రపురం వస్తున్న ఒక కుటుంబం బస్సులో పోగొట్టుకున్న నగదు అందజేయడంతో ఆనందం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే సాలూరు డిపో కు చెందిన బస్సులో వైజాగ్ లో ఒక కుటుంబం రామభద్రపురం వచ్చేందుకు ఎక్కారు. టికెట్ తీసుకున్న తరువాత భర్త తన భార్యకు రూ 4600 తో పర్సు ఇచ్చి భద్ర పరచమని ఇచ్చారు. ఆమె చుడీదార్ జేబులో పెట్టడం జరిగింది. అయితే ఆమె అశ్రద్ధగా జేబులో పెట్టబోయి కింద పడేయడం తో బస్సులో పర్సు సీటు కింద పడిపోయింది. ఇది గమనించని వారు బస్సు దిగి చూసుకుని డబ్బులు పోయినట్లు కనుగొని స్థానిక కాంప్లెక్ వద్ద ఆర్టీసీ పార్సెల్ కౌంటర్ ఏజెంట్ నల్ల భాస్కరరావుకు విషయం చెప్పారు. ఆయన వెంటనే స్పందించి వారి టిక్కెట్ ఆధారంగా ఆ బస్సు కండక్టర్ ను గుర్తించి ఫోన్ చేసి వారి సీటు వద్ద పరిశీలించగా వారి నగదుతో ఉన్న పర్సు దొరికింది. వెంటనే వారికి నగదుతో ఉన్న పర్సు అందజేశారు. సమయ స్ఫూర్తి గా వ్యవహరించి స్పందించిన భాస్కరరావుకు ఆ ప్రయాణీకులు కృతజ్ఞత తెలిపి వారి సమక్షంలో పోగొట్టుకున్న నగదు తీసుకున్నారు.




## మేజర్ గోపాలనాయుడును సత్కరించిన కోట్ల



**పూసపాటిరేగ, జూన్ 22, మేజర్ న్యూస్:** కొప్పవరం జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో అయిదుగురు టెర్రరిస్టులను మట్టు పెట్టి దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసిన మేజర్ మల్ల రామ్ గోపాల్ నాయుడు ను జనసేన నాయకుడు, కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు ఆదివారం ఘనంగా సత్కరించారు. జనసేన నేత, ఎమ్మెల్సీ అయిన కొణిదల నాగబాబు తో కలిసి మేజర్ రామ్ గోపాల్ నాయుడు భోగాపురం సన్ రేకు విచ్చేశారు. ఈ సందర్భంగా మేజర్ రామ్ గోపాల్ నాయుడు ను జనసేన నాయకుడు, కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు కలిసి ఘనంగా ఈ సందర్భంగా రామ్ గోపాల్ నాయుడు సైనిక దళంలో అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. యావత్ భారతావనికి మేజర్ రాంగోపాల్ నాయుడు అందించిన సేవలు గుర్తుండిపోతాయని రఘు ప్రశంసించారు. 2023లో కుప్వారా లో జరిగిన ఎదురు కాల్పుల్లో ఐదుగురు టెర్రరిస్టులను మట్టు పెట్టి దేశ రక్షణకు వీరోచితంగా పోరాడి దేశ చరిత్రలోనే గర్వించ తగిన రోజు అవుతుందని ఈ సందర్భంగా రఘు మేడ్చల్ రామ్ గోపాల్ నాయుడు ను ప్రశంసించారు. రాంగోపాల్ నాయుడుకు కీర్తి చక్ర అవార్డు ఇవ్వాల్సిన అవసరం భారత ప్రభుత్వానికి ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కూడా పాల్గొన్నారు.

## యువత పోరును జయప్రదం చేయాలి



**నెల్లిమర్ల, జూన్ 22, మేజర్ న్యూస్:** ఈ నెల 23న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద వైసిపి ఆధ్వర్యంలో తలపెట్టనున్న యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు పిలుపునిచ్చారు. నెల్లిమర్ల పార్టీ కార్యాలయంలో వైస్ చైర్మన్ కారుకొండ కృష్ణ, కౌన్సిలర్ చిక్కాల సంతోష్ కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావుతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిక్కాల మాట్లాడారు. నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం యువతను మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఆ ఊసే ఎత్తలేదని ధ్వజమెత్తారు. అబద్ధపు హామీలతో ప్రభుత్వం యువతను మోసం చేసిందన్నారు. సూపర్ సిక్స్ హామీలను ఎట్టిపరిస్థితుల్లోనూ అమలు చెయ్యాల్సిందేనని చిక్కాల డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై యువత పోరు ధర్నాలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నగర పంచాయతీ పార్టీ జేఏసీ చైర్మన్ మజ్జి గణేష్, యువజన విభాగం టౌన్ అధ్యక్షుడు కారుకొండ హరీష్, సారిపల్లి కృష్ణ పాల్గొన్నారు.

## అప్పలరాజును వరించిన బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు




**పూసపాటిరేగ, జూన్ 22, మేజర్ న్యూస్:** మండలంలోని చోడమ్మా అగ్రహారం పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ నల్ల అప్పలరాజుకు బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డు వరించింది. అప్పలరాజు గత కొన్నేళ్లుగా బ్లడ్ క్యాంప్ కార్యక్రమాలతో పాటు కార్మికుల పక్షాన పోరాడి కార్మిక పక్షపాతిగా నిలవడంతో హైదరాబాదుకు చెందిన విజన్ స్టూడియో నిర్వహించే జస్ట్ ఎక్సెలెన్స్ అవార్డుకు ఎంపికై ఆ పురస్కారాన్ని హైదరాబాదులోని అప్పల్రాజు అందుకున్నారు. ప్రజా జీవితంలో సామాజిక స్పృహతో అందించిన సేవలు గాను ఈ అవార్డు తనను వరించడం మరింత బాధ్యత పెంచినట్లు అయిందని అవార్డు గ్రహీత అప్పలరాజు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## శిధిలావస్థలో హోమియోపతి వైద్యశాల

### పట్టించుకోని ప్రభుత్వం





**లక్కవరపుకోట, జూన్ 22, మేజర్ న్యూస్:** మండల కేంద్రంలో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పక్కనే గల హోమియో వైద్యశాల శిథిలావస్థకు చేరుకొని ఇటువంటి సౌకర్యాలు లేక ఎప్పుడు పడిపోతుందో తెలియక అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు నేటి రోజుల్లో అల్లోపతి కంటే హోమియోపతి దీర్ఘకాల వ్యాధులను నియంత్రించడంలో చక్కగా పనిచేస్తుందని నమ్మకం ప్రజల్లో వచ్చింది కనుక ఎక్కువ శాతం హోమియో వైద్యశాలను సందర్శించి ఇక్కడ మందులు వాడడం ద్వారా అనేక రోగాలు నయం చేసుకుంటున్నారు ఆపరేషన్ లేకుండా అనేక వ్యాధులు హోమియోపతి మందుల ద్వారా నయం అవుతాయనేది రోగుల్లో ఉన్న నమ్మకం కనుక చిన్నపిల్లల నుంచి ముసలి వారి వరకు మండల కేంద్రంలోని హోమియోపతి వైద్యశాలకు వచ్చి చికిత్స నిమిత్తం వైద్యులను సంప్రదిస్తున్నారు అయితే ఈ వైద్యశాల ఎప్పుడు పడిపోతుందో తెలియదు అన్న దీన అవస్థలో ఉండడంవల్ల రోగులు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు కనుక ప్రభుత్వం జిల్లా అధికారులు స్పందించి ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి భవనాలను పునరుద్ధరించి రోగులకు సిబ్బందికి అసౌకర్యం లేకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు

### జగన్నాథపురం గ్రామంలో

## ఉచిత మెడికల్ క్యాంపు



**బొబ్బిలి, జూన్ 22, మేజర్ న్యూస్:** బొబ్బిలి మండలం జగన్నాథపురం గ్రామపంచాయతీ సచివాలయంలో ఆదివారం గ్రామ ప్రజల కోసం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించబడింది. గ్రామస్థుల ఆరోగ్య సంరక్షణకు తోడ్పడే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వివిధ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించబడ్డాయి. అవసరమైన మందులు కూడా ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రతినిధి బొద్దల సత్యనారాయణ, మరియు ఎంపీటీసీ సభ్యులు రౌతు తిరుపతిరావు ప్రారంభించారు. క్యాంపులో పాల్గొన్న పేషెంట్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది పేషెంట్లకు పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఈ ఉచిత మెడికల్ క్యాంపు ను ఉపయోగించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన డాక్టర్స్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.




## రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులుగా కూన రవికుమార్




**ఆమదాలవలస, జూన్ 22, మేజర్‌న్యూస్:** రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఆమదాలవలస ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ ఎన్నికయ్యారు. శ్రీకాకుళంలో ఓ ప్రైవేట్ హోటల్లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్, నూతన కార్యవర్గం కోసం ఎలక్షన్స్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులుగా ఎమ్మెల్యే కూన రవికుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గంలో వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ కామేశ్వరి (నెల్లూరు), స్టేట్ సెక్రటరీ సూర శ్రీనివాస్( శ్రీకాకుళం), జాయింట్ సెక్రటరీ ఏ.నాగ రాంప్రసాద్( ఈస్ట్ గోదావరి ), పి.సంపత్ రెడ్డి ( గుంటూరు ), సీఈఓ వెంకటేశ్వర్లు (అనంతపురం ), కన్వీనర్ ఎం.వి రమణ (శ్రీకాకుళం ), ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.నరసింహ రెడ్డి (గుంటూరు) ఎన్నుకున్నారు. ఈ ఎలక్షన్ కి ఎలక్షన్స్ ఆఫీసర్ గా రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాధరావు, ఇండియా ఫెడరేషన్ సెక్రటరీ ఆఫ్ సాఫ్ట్ బాల్ ప్రవీణ్ ఆరోరా సమక్షంలో నిర్వహించారు. అధ్యక్షులుగా ఎన్నికైన ఎమ్మెల్యేను పలువురు అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

## కుదిరాంలో ఉచిత వైద్య శిబిరం



**ఆమదాలవలస, జూన్ 22, మేజర్‌న్యూస్:** సత్యసాయి సేవా సమితి మెట్టక్కివలస ఆధ్వర్యంలో ఆదివారం పురపాలక సంఘం పరిధిలోగల 21 వ వార్డు కుద్దిరాం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సత్య సాయిబాబా వారి శత జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా కుద్దిరాం మహా యజ్ఞ గ్రామముగా ఎంపిక చేసుకున్నారు. ఉచిత మెడికల్ క్యాంపు ను జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గ్రామ సేవ మెసెంజర్ ఆకెళ్ళ రామలక్ష్మి, సమితి కన్వీనర్ కన్నేపల్లి వెంకట కామావధానులు, బాలవికాస్ కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా సేవాదళ్ సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్మెంట్ సమన్వయకర్త బోయిన నరసింహమూర్తి పాల్గొన్నారు. ఈ మెడికల్ క్యాంపులో 120 మందికి తనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. డాక్టర్ తాతయ్యలు, డాక్టర్ అనిత, డాక్టర్ బి సాయికిరణ్ డాక్టర్ రుషికేశ్ వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సమితి స్టడీ సర్కిల్ ఇంచార్జ్ మల్లేశ్వరరావు,సేవాదళ్ కోఆర్డినేటర్ ఎస్ జి.రమణ, యూత్ కోఆర్డినేటర్ బి.దామోదర పట్నాయక్, కె. ప్రహ్లాద రావు, యోగేశ్వర పట్నాయక్, బగాది విశ్వనాథం, ఆకెళ్ళ శేషగిరి శాస్త్రి, పెద్దబాబు, రవీంద్రబాబు, గంగాధర్, రాజ్యలక్ష్మి కె.కళారాణి, పాల్గొన్నారు.

# శ్రీకాకుళంలో ఒలింపిక్ డే రన్..

## జెండా ఊపి ప్రారంభించిన ఒలింపి అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాన కృష్ణ దాస్

**శ్రీకాకుళం/ నరసన్నపేట, జూన్ 23, మేజర్‌న్యూస్:** అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా శనివారం ఉదయం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఒలింపిక్ డే రన్ అట్టహాసంగా సాగింది. జిల్లా ఒలింపిక్ సంఘం, క్రీడాప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ రన్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం 6.30 గంటలకు పొట్టి శ్రీరాములు జంక్షన్ నుంచి మాజీ ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ జెండా ఊపి రన్‌కు ప్రారంభం పలికారు. అక్కడి నుంచి కళింగ రోడ్డులోని వైఎస్సార్ సర్కిల్, పాలకొండ రోడ్డు, కృష్ణా పార్కు, డే అండ్ నైట్ జంక్షన్, అంబేద్కర్ జంక్షన్ మీదుగా కోడు రామ్మూర్తి స్టేడియం వరకు రన్ కొనసాగింది. వైద్యులు, విద్యార్థులు, పారామెడికల్ సిబ్బంది, మహిళలు, యువత,



వివిధ సంస్థల ప్రతినిధులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. శ్రీధరరావు మాట్లాడుతూ "క్రీడల ద్వారా ఆరోగ్యంతో పాటు ఏకతత్వ భావన పెరుగుతుంది. ఒలింపిక్ స్ఫూర్తిని ప్రజల్లోకి చాటడమే ఈ రన్ ఉద్దేశం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, క్రీడా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైయస్ జగన్మోహన్ రెడ్డికి హాని తల పెట్టాలని కూటమి కుట్ర

- పల్నాడులో వైయస్ జగన్ పర్యటన విజయవంతం
- పోలీసులతో పన్నిన కుట్రలు ఫలించలేదు
- జనంలో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేకపోతున్నారు
- కూటమి పాలనపై తీవ్రమవుతున్న ఆగ్రహంకు భయపడుతున్నారు, అని తిలక్ పేర్కొన్నారు




**నందిగాం, జూన్ 22, మేజర్‌న్యూస్:** నందిగాం వైఎస్ఆర్సీపీ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్. మాజీ సీఎం,వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి గారికి హాని తలపెట్టాలని కూటమి ప్రభుత్వం కుట్రలకు తెగబడుతోందని పేరాడ తిలక్ మండిపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ రోజురోజుకూ వైయస్ జగన్‌కు పెరుగుతున్న ఆదరణ, కూటమి పాలనపై ప్రజల్లో వ్యక్తమవుతున్న వ్యతిరేకతను చూసి భయంతో రాజకీయంగా ఆయన ఉనికినే లేకుండా చేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిగారిని పట్టుకుని "నిన్ను చంపేస్తే తప్పేముంది? నీ తల నరకొచ్చు కదా?" అంటూ మీ పార్టీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అంటున్నారు అని కూటమి ప్రభుత్వాన్ని అన్నారు. దీనిపై ఏం సమాధానం చెబుతారు అని తిలక్ ప్రశ్నించారు.ఈ కార్యక్రమం లో యువనాయకుడు సిర్లాపు నరేష్ మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

## జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడి



**శ్రీకాకుళం, జూన్ 22, మేజర్‌న్యూస్:** నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక జిల్లా పరిషత్ లో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో ఆదివారం వెల్లడించారు.

అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

అర్జీదారులు గమనించి నేడు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన శ్రీ సత్య సాయి సేవా సమితి



**ఉక్కునగరం, గాజువాక, జూన్ 22, మేజర్‌న్యూస్:** ఉక్కునగరం శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నో ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు భక్తిపరవశంతో నిర్వహించబడ్డాయి. తెల్లవారుఝామున శ్రీ సత్య సాయి సుప్రభాతం, అనంతరం నగరసంకీర్తన నిర్వహించబడింది. తదుపరి రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించబడింది. నారాయణ సేవ(భోజన ప్రసాదం) కోసం భక్తుల సహకారంతో 5 గంటలకే అన్నప్రసాద తయారీ ప్రారంభ మైంది. ఉక్కునగరంలోని శ్రీ సత్య సాయి యువత ఉదయం అచ్చుతాపురం లోని వికలాంగుల పాఠశాలకు బయలుదేరి అక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడి వాష్ రూముల తలుపుల మరమ్మత్తులు, పరిశుభ్రత పనులు, ఎలక్ట్రికల్ వైరింగ్ వంటి సేవలు అందించారు. వేసవి సెలవుల అనంతరం శ్రీ సత్య సాయి బాలవికాస్ తరగతులు శ్రీ సత్య సాయి మందిరంలో తిరిగి ప్రారంభమయ్యాయి. సాయంత్రం శ్రీ సత్య సాయి భక్తుల కీర్తనలతో ఆలపించిన పల్లకీ సేవ ఉత్సాహభరితంగా ఉక్కునగరం 2 & 3 సెక్టార్ల ప్రాంతాల్లో నిర్వహించబడింది. పల్లకీ సేవలో భాగం గా విశ్వశాంతి, సమాజ శ్రేయస్సు కోసం శ్రీ సత్య సాయి భక్తులు భజనలు ఆలపించారు. అనంతరం ఉక్కునగరం శ్రీ సత్య సాయి మందిరంలో భజనలు మధురంగా కొనసాగాయి. విశ్వశాంతి, సమాజ శ్రేయస్సు కోసం అందరూ భజనలు ఆలపించారు. ఈ కార్యక్రమాల్లో జి. రామకృష్ణ (కన్వీనర్), ఎస్. కె. ఆర్. కె. రాజు (జాయింట్ కన్వీనర్), ఎస్. ఎం. విష్ణుమూర్తి , పద్మ , ఇతర పదాధికారులు, సీనియర్ భక్తులు, శ్రీ సత్య సాయి పురుష, మహిళా, యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పల్లా సేవలు మరవలేనివి నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



**గాజువాక, జూన్ 22, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తండ్రి, విశాఖ–2 మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం సంతాప సభకు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పల్లా సింహాచలం విశాఖ నగర ప్రజలకు, కార్మికులకు చేసిన సేవలు మరువలేనివన్నారు. జిల్లా యాదవ కుల అధ్యక్షుడిగా తమ కుల అభివృద్ధికి అపూర్వంగా కృషి చేశారు. అందుకే ఈ రోజు వారి కుమారుడైన పల్లా శ్రీనివాసరావు పట్ల కూడా అదే స్థాయిలో అభిమానాన్ని కలిగి ఉన్నారు.కార్మికుడికి కష్టం వచ్చిందంటే తనకే వచ్చినట్లు భావించి వెంటనే పరిష్కారం కోసం ముందుకొచ్చే గుణం ఆయనది.అలాంటి గొప్ప సేవా గుణం కలిగిన వ్యక్తి మన మధ్యలో ఇక లేనప్పటికీ, ఆయన చేసిన సేవలు శాశ్వతంగా ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

## 39 వార్డులో వైన్ షాప్ ఏర్పాటుపై రగడ



**విశాఖపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** విశాఖ పాత నగరం 39 వార్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వైన్ షాపును స్థానికులు అడ్డుకున్నారు. ఆదివారం ఉదయం వైన్ షాప్ నిర్వాహకులు దుకాణాన్ని ఓపెన్ చేశారు. ఎటువంటి బోర్డు ఏర్పాటు చేయకుండా స్టాక్ ను దుకాణంలో దించే ప్రయత్నం చేశారు. విషయం తెలియడంతో స్థానికులు స్టాక్ ను లోపలికి రానీయకుండా అడ్డుకున్నారు. అనంతరం స్థానిక బిజెపి జనసేన టిడిపి కూటమి నాయకుల తో కలిసి స్థానిక ప్రజలు దుకాణం వద్ద ఆందోళనకు దిగారు. ఇప్పటికే వన్ టౌన్ ప్రాంతంలో బార్లు వైన్ షాపులు దుకాణాలు అధికంగా ఉన్నాయని, ఇంకా అదనంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని నాయకులు గట్టిగా చెప్పారు. స్థానికులు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కు ఫోన్ చేసి విషయాన్ని వెల్లడించారు. సమీపంలో స్కూల్స్, ఆలయాలు ఉన్నాయని నివాస గృహాల మధ్య వైన్ షాప్ ఏర్పాటు చేయకుండా చూడాలని విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వైన్ షాప్ ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరోవైపు స్థానిక మహిళలు, నాయకులు నగర పోలీస్ కమిషనర్ కు నేరుగా ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ వన్ టౌన్ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. వన్ టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వైన్ షాప్ నిర్వాహకులను అక్కడినుంచి పంపించేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు సాయి బలరాం, అబ్దుల్ హనీఫ్ , మైలపల్లి చిన్న, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

### జనసేన నాయకుడు వైన్ షాపు!

39 వార్డులో వివాదం చోటు చేసుకున్న వైన్ షాప్ జనసేన నాయకుడికి చెందినదిగా తెలుస్తుంది. సదరు నాయకుడు గతంలో వైసీపీలో కీలక నాయకుడిగా వ్యవహరించాడు. గత ఎమ్మెల్యే వాసుపల్లికి ఆ నాయకుడు అత్యంత సన్నిహితుడుగా ముద్ర వేసుకున్నాడు. గతంలో ఒక ప్రముఖ ఆలయానికి చైర్మన్ గా వ్యవహరించి పలు వివాదాలకు కేంద్ర బిందువు అయ్యాడు. ఎన్నికల అనంతరం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్న ఆ నాయకునికి ఈ వైన్ షాప్ చెందినదిగా ప్రచారం జరుగుతుంది.

## ఘనంగా వెంకటేశ్వర స్వామివారికి గరుడ వారి విగ్రహ ప్రాణులు ప్రతిష్ట



**గాజువాక, జూన్ 22, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీ గరుడాద్రి కొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ చైర్మన్ దొడ్డి రమణ స్వామివారికి మహాభిషేకం, గరుడ స్వామి వారి విగ్రహ ప్రాణ ప్రతిష్ట ఆంధ్రప్రదేశ్ సాదు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాస నంద సరస్వతి స్వామి వారి చేతుల మీదుగా జరిగినది. ధ్వజస్తంభం స్థాపించి 16 రోజుల సందర్భంగా గరుడ స్వామి వారి విగ్రహ ప్రాణ ప్రతిష్ట, అభిషేకాలు, విశిష్ట పూజలు ఆలయ ప్రధాన అర్చకులు పరిహారం మణికుమార్ ఆచార్యులు, కార్యక్రమ ప్రధాన అర్చకులు హరికృష్ణ ఆచార్యులు చేతుల మీదుగా అభిషేకములు, హెూమము జరిపించారు. అతిథులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఉత్తర ద్వారంలో వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి, వాంబే కాలనీ వైకుంఠ వెంకటేశ్వర స్వామిని ఏడు వారాలు నిష్టతోతో పూజ చేసి ఏడు ప్రదర్శనలు స్వామి వారి ఆలయం చుట్టూ తిరిగి స్వామివారిని కోరిన కోర్కెలు తీర్చుతారని భక్తులకు ప్రగాఢ నమ్మకం. ఈ కార్యక్రమంలో శ్రీరామమూర్తి రాజు, పార్వతి దేవి దంపతులు,మిత్తనఅప్పల్ రెడ్డి, పెంటకోట నాగేశ్వరరావు, పెంటకోట రాజు, ఆలయ సేవకులు, ఆలయ పోషకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు పండ్లు, రొట్టెలు పంపిణీ



**ఆరిలోవ, జూన్ 22, మేజర్‌న్యూస్:** జీవీఎంసీ 13వ వార్డు పరిధిలో తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు 65వ జన్మదినాన్ని పురస్కరించుకొని వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ ఎదురుగా గల ప్రభుత్వ బాయ్స్ హాస్టల్ లో కార్యక్రమానికి తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు తనయుడు ప్రతాప్ రుద్ర హాజరై కేక్ కట్ చేసిన అనంతరం పిల్లలకు ఫ్రూట్స్, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు పోత్రకొండ ధర్మరావు, కార్యదర్శి సురేష్ క్లస్టర్ ఇంచార్జ్ బాలస్వామి మహిళా అధ్యక్షురాలు రమణి, బీసీ నాయకులు ఒడిసెల శ్రీను నాయకులు, అడ్డూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## డి ఈ ఓ ఆఫీస్ వద్ద ఉపాధ్యాయుల ధర్నా



**ఆరిలోవ, జూన్ 22, మేజర్‌న్యూస్:** 1998,2008 డీఎస్సీ ఉపాధ్యాయులు కౌన్సిలింగ్ కి బదిలీల విషయమై డీఈఓ కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం ధర్నా జరిపారు. 1998,2008 డీఎస్సీ కి చెందిన ఉపాధ్యాయులు బదిలీ విషయమై ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహిస్తామని హాజరు కావలసిందిగా డీఈవో తెలిపారు. ఈ నేపథ్యంలో 425 మంది ఈ ఉపాధ్యాయులు కౌన్సిలింగ్ కోసం హాజరయ్యారు. అయితే వీరికి ఏజెన్సీ కొండ ప్రాంతంలోనే బదిలీ చేస్తామని చెప్పడంతో ఉపాధ్యాయులు ఒకసారి ఖంగు తిన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న 180 క్లస్టర్ లో 540 ఉపాధ్యాయులు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ స్థానంలో వీరికి బదిలీ చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని డిఇ ఒ కు సమర్పించారు.

## ఆస్తి తగాదాలతో వ్యక్తి హత్య



**నందిగాం, జూన్ 22, మేజర్‌న్యూస్:** నందిగామ మండలం కామదేనువు గ్రామానికి చెందిన కిల్లి. తవిటయ్య (50) సుమారు ను అతని అన్న కిల్లి ధర్మారావు పారతో బలంగా తలపై కొట్టి హత్య చేశాడు ఈ హత్యకు కారణాలు ఆస్తి తగాదాలని కుటుంబ సభ్యులు పోలీసులు కి ఇచ్చిన పిర్యాదు లో తేల్చి చెప్పారు, ఆస్తికోసం ఇద్దరు అన్నదమ్ములు గత నాలుగు నెలల నుంచి కలెక్టర్కు ఫిర్యాదు చేసుకొని నందిగా మండల తహసిల్దార్ ద్వారా మరియు గ్రామ పెద్ద మనుషుల ద్వారా సమస్య పరిష్కరించుకొనుటకు ప్రయత్నించడం జరిగింది. కానీ సమస్య పరిష్కారం కాలేదు. ఈ సమయంలోనే అనగా ఈరోజు సాయంత్రం మూడున్నర గంటల సమయంలో కిల్లి తబిటయ్యకు అతని అన్న కిల్లి ధర్మారావు బలంగా పార తో కొట్టి హత్య చేశాడు. మృతదేహాన్ని టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మూడు దేవాలయాలతో దివ్యత్వాన్ని చాటిన ఎరుకలపాకలు గ్రామం

### పాలవలస గౌరుకు గ్రామ ప్రజల అభినందనలు



**బాడంగి, జూన్ 22, మేజర్ న్యూస్:** మండలంలోని ఎరుకలపాకలు గ్రామం నేడు టిడిపి పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రెటరీ ఏపీ ఎరుకుల సేవా సంఘం ఉమ్మడి విజయనగరం జిల్లా అధ్యక్షులు గజరాయిని వలస ఎంపిటిసి పాలవలస గౌరు ఆధ్వర్యంలో ఆధ్యాత్మికత, అభివృద్ధి రెండింటి మార్గంలో వేగంగా పురోగమిస్తోంది. ఎన్నో తరాలుగా సామాజికంగా వెనుకబడిన ఎస్టీ ఎరుకుల కులస్తులు ఈ గ్రామంలో 100 నుంచి 120 కుటుంబాలుగా స్థిర నివాసముండి జీవిస్తున్నారు. గతంలో గ్రామంలో దేవాలయాలు లేకపోవడం వలన భక్తి భావనలు, ఆధ్యాత్మిక చింతన కొంత తగ్గినట్లే ఉండేది. అయితే, 1995లో పాలవలస గౌరు సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ దశ తిరిగింది. నేటి వరకు పలు రాజకీయ పదవుల్లో సేవలందిస్తూ, గ్రామ ప్రజల అభ్యున్నతికి అంకితభావంతో ముందడుగు వేసారు. మౌలిక సదుపాయాల ఏర్పాటు నుంచి భక్తిపరమైన మార్గదర్శనమవరకు ఆయన కృషి వెలకట్టలేనిది అని ఆ గ్రామ పెద్దలు ప్రజలు తెలిపారు ఆదివారం ఆ గ్రామస్తులు సూర్యా ప్రతినిధి తోమాట్లాడుతూ భగవంతునిపై అపారమైన భక్తి, శ్రద్ధలతో తమ గిరిజన నాయకుడు గౌరు ఆధ్వర్యంలో 2011లో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం,2017లో రామాలయం,2020లో శ్రీ శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయం పునర్నిర్మాణం చేపట్టారు. దాదాపు 20 ఏళ్ల విరామానంతరం 2023లో, గ్రామ దేవత పండగను గౌరు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిపారు. రాబోయే 2027 పండుగ కోసం ఇప్పటినుంచే ఆయన ఏర్పాట్లు మొదలుపెట్టారు. గ్రామ ప్రజలు అందించిన చిరు సహాయం ?30,000, పాలవలస గౌరు తన సొంత నిధులు 1,40,000 రూపాయి లు సహాయంతో, మొత్తం ?1,70,000 ఖర్చుతో మూడు ఆలయాలకు నూతనంగా నాణ్యమైన పెయింటింగ్ పనులు చేపట్టారు.ఈ దేవాలయాల నిర్వహణ -ధూప దీప నైవేద్యం, సేవలు, శుద్ధి, శాంతి అన్నింటికీ గౌరు నిస్వార్థ సేవ ప్రధాన ఆధారంగా నిలుస్తోంది. గ్రామానికి ఆధ్యాత్మిక ప్రేరణను అందించి, అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న పాలవలస గౌరు గారిని గ్రామ పెద్దలు, ప్రజలు హృదయపూర్వకంగా అభినందిస్తూ న్నట్లు తెలిపారు ఈ సందర్భంగా పాలవలస గౌరు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు గ్రామంలో చేపడతాననితెలిపారు

## శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఆచార్యుల ఎంపిక



**బొబ్బిలి, జూన్ 22: మేజర్ న్యూస్:** బొబ్బిలి శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఈరోజు పార్వతీపురం డివిజన్ పరిధిలోని సమరసతసేవాఫౌండేషన్ ఆద్వర్యంలో నిర్మించిన దేవాలయాల కేంద్రంగా బాలవికాసకేంద్రాలు నెలకొల్పుటకు మాతాజీ/ఆచార్యుల ఎంపిక విధానం నిర్వహించడమయినది. ఉపాద్యాయ కన్వీనర్ శ్రీకొల్లూరుజగన్నాధరావు ధర్మప్రచారకులు ధూపంవాసు, నరసింగరావు, సురేష్ మరియు శంకరరావు 14 మండలాలు నుండి మాతాజీలు పాల్గొన్నారు వీరందరికీ ప్రముఖ వస్త్ర వ్యాపారి కింతలికుమారస్వామి మద్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు.

## ఆదర్శ పాఠశాలలో దొడ్డిదారిలో

# రికమండేషన్ సీట్లు.!



- **రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్ కు మంగళం.!**
- **కారణంగా ఏడాది పదవ తరగతి ఫలితాలలో నిరాశ.!**
- **ఆరవ తరగతి, ఇంటర్ లోను అదే తీరు.!**
- **విచారణ కొరకు సీటు దక్కని విద్యార్థులు డిమాండ్.!**

**మెరకముడిదాం, జూన్ 22, మేజర్ న్యూస్:** గర్భాం ఆదర్శ పాఠశాల ఒకప్పుడు సరస్వతి నిలయం. అక్కడ ఆరవ తరగతి, ఇంటర్ లో సీటు పొందాలంటే త్రిపుల్ ఐటీ లో సీటు పొందినంత కష్టం. మొన్న విడుదల చేసిన ఇంటర్ ఫలితాలులో ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థిని తాడ్డి.తనూజ 987 మార్కులు సాధించి పాఠశాల పేరును రాష్ట్ర చిత్ర పటం లో నిలబెట్టింది. ఈ నేపథ్యంలోనే సాక్షాత్తు రాష్ట్ర విద్యాశాఖామంత్రి వర్యులు నారా.లోకేష్ అంతటి వారు మంగళగిరి లో ఏప్రిల్ 14 న తనూజా ను స్వయానా అభినందించారు. ఈ పాఠశాలను పేరును కీర్తించారు. అయితే ఆ ఆనందం మరువక ముందే పదవ తరగతి ఫలితాలు ఆదర్శ పాఠశాల కీర్తిని మసక బార్చాయి. ఆ పలితాలు అపకీర్తిని తెచ్చి పెట్టాయి. దానికి కారణాలు అనేకం ఉన్నా, ముఖ్యంగా అనర్హులకు సీట్లు కేటాయింపే ప్రధాన కారణంగా ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఏడాది ఈ పాఠశాల ఇంటర్ లో స్టేట్ ప్రథమ స్థానంలో నిలిచినా, పదవ తరగతి ఫలితాలు నిరాశ కలిగించే విధంగా ఉన్నాయి. ఈ ఆదర్శ పాఠశాల కనీసం ఉన్నత పాఠశాలలతో కూడా పోటీ పడలేక పోయింది. ఈ పాఠశాలలో 98 మంది పరీక్షల్లో రాస్తే 8 మంది ఫెయిల్ లయ్యారు. మండలంలో ఉన్నత పాఠశాలల తో పోలిస్తే మూడో స్థానంలో నిలిచినట్లు సమాచారం. దీనికి కారణం ఒక్కటే ! మెరిట్ విద్యార్థుల ను పక్కన పెట్టి ప్రతీ ఏటా దొడ్డిదారిన అనర్హులకు సీట్లు కేటాయించడమేనని విమర్శలు గుప్పుకుంటున్నాయి. ఈ తతంగం అంతా తెలిసి కూడా జిల్లా విద్యా శాఖాధికారులు కూడా చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ పాఠశాలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేదు. మెరిట్ ప్రకారం సీట్లు కేటాయింపు లేదు. అనర్హులకు, తమకు కావాల్సిన వారికి సీట్లు ఇచ్చేందుకు మెరిట్ విద్యార్థుల ను ఇంటర్వ్యూలో ఏదో విధంగా తిక, మక పెట్టి సీట్లు మిగిల్చు కుంటారని ఒక ఆరోపణ కాగా , ఇంటర్ లో సీటు ఇస్తాను, కానీ హాస్టల్ ఇవ్వను అని చెప్పిన ఆ కారణంతో వారు జాయిన్ అయ్యేందుకు వెనుకాడిన కారణంతో సీట్లు మిగిల్చేసినట్లు బహిరంగ ఆరోపణలు. ఈ కారణంగా మిగిలిన సీట్లును , రూల్ ఆఫ్ రిజర్వేషన్ అంటూ మిగిలించిన సీట్లును పైరవీలు చేసిన వారికి కేటాయించిన కారణంగా,పైరవీలు తో వచ్చిన విద్యార్థులే ఈ పదవ తరగతి ఫలితాలు లో ఘోర పరాజయం పొందుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఈ ఏడాది ఆరవ తరగతి కి 259 మంది ఉత్తీర్ణత పరీక్ష రాశారు. అందులో 80 నుండి 100 వరకూ మెరిట్ ఆధారంగా సీట్లు కేతాయింపు జరగాలి. ఈ సీట్లు ఒకటి నుండి 100 వరకూ ఉన్న విద్యార్థులను మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలి. అలా జరిగినప్పుడే ఉత్తర్ణత శాతం పెరుగుతుంది. ఇప్పుడు అలా సీట్లు కేటాయించకుండా, పైరవీలు చేసిన వారికి కొన్ని సీట్లు కేటాయించి, అర్హులకు మొండిచేయి చూపుతున్నారని ప్రిన్స్ పాల్ పై విద్యార్థుల తల్లి దండ్రులు ప్రధాన ఆరోపణ గా ఉంది. ఇంటర్ ఫస్టు ఇయర్ లోనూ అదే తంతు అందులోనూ అనర్హులకు సీట్లు, అర్హులకు మొండిచేయి చూపినట్లు ఆధారాలతో ఆరోపణలు వస్తున్నాయి. ఇదంతా గోప్యంగా ఉంచడం తో ఈ సీట్లు కేటాయింపులో నిజా,నిజాలను, మరింత సమాచారం ను తెలుసుకోడానికి కొంత మంది సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని తెలుసుకునేందుకు దరఖాస్తు చేసుకునేందుకు సమాయత్తం అవుతున్నారు. దాంతో మోడల్ స్కూల్ లో జరుగుతున్న మరిన్ని విషయాలు బయట పడే అవకాశం ఉంది. గత ఏడాది ఈ పాఠశాలలో జరిగిన పొరపాట్లు నే మరలా ఈ ఏడాది కొనసాగిస్తున్నారన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో విద్యాశాఖ అధికార్లు సమగ్ర విచారణ జరిపించాలని విద్యార్థుల తల్లి దండ్రులు నుండి డిమాండ్లు విపిస్తున్నాయి.

## కోట్లు ఖర్చు చేసి 6 పడకల ఆసుపత్రి భవనం నిర్మించారు

### బిల్లులు చెల్లించక కాంట్రాక్టర్ చేతిలో భవనం





**లక్కవరపుకోట, జూన్ 22, మేజర్ న్యూస్:** లక్కవరపుకోట మండల కేంద్రంలో గల ఆరు పడగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరడంతో గత ప్రభుత్వంలో కొత్త భవనాన్ని నిర్మించే పనులు కాంట్రాక్టర్ కి అప్పగించారు నిర్మాణ పనులు ప్రారంభించి రెండున్నర ఏళ్ళు కావస్తున్నా బిల్లులు అందడం లేదన్న కారణంతో ఇప్పటికీ భవన నిర్మాణ పనులు పూర్తి చేయకుండా వదిలేయడం వలన ఆ భవనం ఇంకా కాంట్రాక్టర్ చేతిలోనే ఉండిపోయింది 90% పనులు పూర్తి కావస్తున్న మిగిలిన బిల్లులు ఇవ్వకపోవడం వల్ల పనులు పూర్తి కావడంలేదనే కారణం చూపి కాంట్రాక్టర్ బిల్డింగ్ ని తమకు అప్పగించడం లేదని వైద్యులు అంటున్నారు అయితే శిథిలావస్థకు చేరిన పాత భవనంలో భవనం పై పెచ్చులు ఊడిపోతున్న ప్రమాదకర పరిస్థితుల్లోనే రోగులకు డాక్టర్లు సిబ్బంది వైద్యం అందిస్తున్నారు ఇప్పటికే చాలాసార్లు భవన పైకప్పు శిథిలాలు రోగులపై పడ్డం వైరింగ్ సరిగాలేక అగ్నిప్రమాదం లాంటివి సంభవించడం జరిగింది అదృష్టవసాత్తు ఈ ప్రమాదాల్లో ఎవరికీ గాయాలు కాకపోవడం ఆ సమయంలో రోగులు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు ఏవో చిన్న చిన్న మరమ్మతులు చేయించి ఇదే భవనంలో వైద్య సేవలు కొనసాగిస్తున్నారు ప్రభుత్వాలు ప్రజా ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని బయటికి గొప్పలు చెబుతున్న ఆచరణలో అవి అమలు కావడం లేదు అనేదానికి ఇటువంటి సంఘటనలు నిదర్శనం విద్యా వైద్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే రెండున్నరేళ్లు ఈ భవనం ఎందుకు పూర్తి కాలేదు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్న ఈ భవనం వైపు ఎందుకు కన్నెత్తి చూడడం లేదు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు ప్రజలకు అత్యవసర సేవ అయినటువంటి వైద్యాన్ని దానికి సంబంధించిన భవన నిర్మాణాలను నిర్మించడంలో ఎందుకు అధికారులు ప్రభుత్వాలు ఇంత అలసత్వం వహిస్తున్నాయి అనే దానికి సమాధానం చెప్పవలసిన అవసరం ఉంది స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఈ ఈ విషయంపై దృష్టి సారించి భవన నిర్మాణం పూర్తయ్యేలా అధికారులు ఆదేశించాలని రోగులకు కొత్త భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## బీజేపీలో చేరిన ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ్ చాలక్ సభ్యులు



**బొబ్బిలి, జూన్ 22: మేజర్ న్యూస్:** బొబ్బిలి కి చెందిన పూర్వ ఆర్ ఎస్ ఎస్ జిల్లా సంఘ్ చాలాక్ శ్రీ పెంట స్వామి నాయుడు ఆదివారం విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ రాజేష్ వర్మ ఆధ్యర్యం లో రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి సమక్షంలో విజయవాడ లో బీజేపీ రాష్ట్ర కార్యాలయం లో చేరడం జరిగింది. స్వామి నాయుడు తో పాటు బొబ్బిలి పట్టనానికి చెందిన శ్రీ కాశి విశ్వేశ్వర రావు(పెద్దింపేట మాజీ సర్పంచ్ )గేదెల రమణ, చెలికాని కేశవ, ఉమా మొదలైన వారి చేరిక కూడా జరిగింది. చేరిక అనంతరం రాష్ట్ర బీజేపీ సంఘటన మంత్రి మధుకర్ ని కలవడం జరిగింది.

## తోలంగూడ, కోసంగూడ,కుమ్బీరికి వలస, ఈ నట్ గూడలకు రోడ్డు ఎప్పుడు వేస్తారు?

### సీపీఎం జిల్లా కార్యదర్శి గంగు నాయుడు



**కురుపాం, జూన్ 22, మేజర్ న్యూస్:** కురుపాం మండలం వబ్బంగి పంచాయతీలో కొండలపై ఉన్న గ్రామంలు తోలంగూడ , కోసం గూడ, కుమ్బిరికి వలస, ఈనట్ గూడ,కోసం గూడా లకు గత 30 ఏళ్లుగా రోడ్డు వేయండి బాబోయ్ అని గిరిజనులు అనేక సందర్భాల్లో మొరపెట్టుకున్న ఏ ప్రభుత్వం ఇంతవరకు రోడ్డు వేయలేదని ఈ గిరిజన గ్రామాలకు రోడ్లు ఎప్పుడు వేస్తారని సిపిఎం పార్టీ మన్యం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రశ్నించారు తొలింగూడ వచ్చిన ఆయన గిరిజనులతో రోడ్డుపై నిరసన తెలియజేశారు ఈ సందర్భంగా గంగు నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసిందని మన గిరిజన బిడ్డ తోయక జగదీశ్వరి మన కష్టాలు తీరుస్తుందని ఓట్లేసి గెలిపిస్తే కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడంలేదని అన్నారు అలాగే పవన్ కళ్యాణ్ గారు అటు పాడేరు ప్రాంతంలో ఇటు సాలూరు మన్యం ప్రాంతంలో పర్యటన చేసి కొన్ని గ్రామాల రోడ్లు ప్రారంభించి మొత్తం గిరిజన గ్రామాలకు రోడ్లు వేయిస్తానని హామీలు ఇచ్చారని ఇంతవరకు ఆ హామీలు నెరవేరలేదని అన్నారు గిరిజన గ్రామాల్లో ఇప్పటికి కూడా రోడ్లు లేక డోలిమోతుల తప్పడం లేదని, గిరిజనులు అటవి ఉత్పత్తులు అమ్ముకోవాలన్న, నిత్యావసర వస్తువులు తెచ్చుకోవాలన్న తీవ్ర ఇబ్బందులు కు గురవుతున్నారు అని వారి పంటలు కు గిట్టు బాటు దర లు రావడం లేదని అన్నారు . అమరావతి రాజధానిలో వేలకోట్ల రూపాయలు తెచ్చి యుద్ద ప్రాతిపదికన రోడ్లు వేసి అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాలకు మాత్రం రోడ్లు వేయడానికి నిర్లక్ష్యం వహిస్తుందని అంటే అమరావతిలో తిరిగిన వారు విలువైన వార గిరిజనుల కారా అని ప్రశ్నించారు. పెత్తందారులున్న గ్రామాలకు మాత్రం ఒకే గ్రామానికి రెండేసి రోడ్లు వేస్తున్నారని గిరిజనులను చులకనగా చూస్తున్నారని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లు వెయ్యక పోతే ఈ రోడ్లు కోసం దశలవారీ పోరాటం చేస్తామని అన్నారు .కలెక్టర్ గారికి మెమోరాండాలు గతంలో ఇచ్చామని ఇక మెమోరాండాలు ఇవ్వడం జరగదని గిరిజనులు పోరాటాలు కు సిద్ధమవుతున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు ఎం .అడ్డమేశ్వరరావు , బిద్దిక భాస్కర్ రావు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు

## జాబ్ మేళాకు విశేష స్పందన



**నెల్లిమర్ల, జూన్ 22, మేజర్ న్యూస్:** నెల్లిమర్ల పట్టణంలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించింది. మేళాలో జిల్లాకు చెందిన 437 మంది నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు. హెటెరో, వరుణ్ మోటార్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ తదితర 13 కంపెనీలకు చెందిన ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 162 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి ప్రశాంత్ కుమార్ మేళాను పర్యవేక్షించారు. ప్లేస్మెంట్ అధికారి భాస్కర్, కోఆర్డినేటర్ నీతూ పాల్గొన్నారు.




## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**గరుగుబిల్లి, జూన్ 22, మేజర్ న్యూస్:** పార్వతీపురం మన్యం జిల్లా ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదేశాల మేరకు గరుగుబిల్లి మండల కేంద్రం నుంచి సీతానగరం మండలం బూర్జి వరకు ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నారు.ప్రత్యామ్నాయ విద్యుత్తు లైను పనులు కారణంగా విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేయడం జరుగుతుందని మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బడే శ్రీనువాసనాయుడు వెల్లడించారు. నిర్వహణ పనులు కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యా హ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్న నేపథ్యంలో వినియోగదారులు ఈవిషయాన్ని గమనించాలని మండల విద్యుత్ శాఖ అసి స్టెంట్ ఇంజనీర్ బడే శ్రీనువాసనాయుడు తెలిపారు.త అలసత్వం వహిస్తున్నాయి అనే దానికి సమాధానం చెప్పవలసిన అవసరం ఉంది స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఈ ఈ విషయంపై దృష్టి సారించి భవన నిర్మాణం పూర్తయ్యేలా అధికారులు ఆదేశించాలని రోగులకు కొత్త భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## అమెరికా సదస్సుకు సెంచూరియన్ ప్రతినిధులు

**నెల్లిమర్ల, జూన్ 22, మేజర్ న్యూస్:** అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్ కోలో నిర్వహించనున్న 62వ డిజైన్ ఆటోమేషన్ కాన్ఫరెన్స్ ( డాక్) సదస్సుకు భారత్ నుంచి సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.ఎన్.రావు ఆధ్వర్యంలో డా. చంద్రశేఖర్ దాస్ గారు, లక్ష్మికాంత్ సుతార్ పాల్గొంటున్నారు. ఈ నెల 22 నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో చిప్స్ టు సిస్టమ్స్ అనే అంశంపై ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సీమెన్స్, చిప్ ఏజంట్స్ ఏ1, సినాప్సిస్, కీసైట్, ఎన్సిస్, కాడెన్స్, రాకెట్ సాఫ్ట్ వేర్ వంటి దిగ్గజాలు తమ తాజా ఆవిష్కరణలను ప్రదర్శించనున్నాయి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డి.ఎన్. రావు గారు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి వేదికపై మన సామర్థ్యాలను పరిచయం చేయడానికి భారత్ నుండి ప్రథమ విశ్వవిద్యాలయంగా నిలిచినందుకు గర్విస్తున్నామన్నారు. ఈ సదస్సులో పాల్గొనడం ద్వారా మన పరిశోధన, ఆవిష్కరణల పట్ల నిబద్ధతను ప్రదర్శిస్తున్నామన్నారు. సెంచూరియన్ యూనివర్శిటీ పరిశ్రమలతో సంబంధాన్ని బలోపేతం చేసేందుకు ప్రముఖ సెమికండక్టర్ డిజైన్ సంస్థ మార్కీసెమికండక్టర్ తో భాగస్వామ్యం ఏర్పరచుకుందన్నారు. ఈ సహకారం ద్వారా విద్యార్థులకు ఆధునిక టూల్స్ మీద అనుభవం కల్పించడంతో పాటు, సెమికండక్టర్ టెక్నాలజీలో శిక్షణను మరింత బలోపేతం చేయనుందన్నారు. ఈ వేదికపై వివిధ రంగాల్లో నూతన ఆవిష్కరణలను ప్రదర్శించనున్నట్టు తెలిపారు. వాటిలో క్రోమైట్ ఎం ఎస్ఒసి ఫిజికల్ డిజైన్ – సిస్టమ్–ఆన్–చిప్ అభివృద్ధి వేదిక, డిజిటల్ మానుఫ్యాక్చరింగ్ ఫర్ అపారెల్ ట్రాకింగ్, డోమ్ మరియు స్మార్ట్ పాలీహౌస్ – ఐఒటి ఆధారిత పర్యావరణ నియంత్రణ, హై–థ్రూపుట్ ప్లాంట్ ఫీనోటైపింగ్ సొల్యూషన్స్, ఎలక్ట్రిక్ కంట్రోల్ యూనిట్ – ఎంబెడెడ్ సిస్టమ్ ఆవిష్కరణ, స్మార్ట్ రెట్రోఫిట్ లేథ్ ఆటోమేషన్ సొల్యూషన్ వంటి ఆవిష్కరణలు ఉన్నాయన్నారు. సెంచూరియన్ యూనివర్శిటీ తన ఆవిష్కరణలకు విశ్వవ్యాప్త గుర్తింపు పొందడానికి, మరియు అధ్యాపకులు, విద్యార్థులకు ప్రపంచ స్థాయి పరిశోధన వాతావరణాన్ని కల్పించడానికి ముందడుగు వేస్తోందన్నారు. చిప్ డిజైన్ మరియు తయారీ (ఇడిఎ టూల్స్, నానో–ఫాబ్రికేషన్, విఎల్ఎస్ఐ), బ్లాక్‌చెయిన్, జనరేటివ్ ఎ1, ఎఆర్/ విఆర్ మెటావర్స్ఇం డస్ట్రియల్ ఐఒటి, డ్రోన్లు, స్మార్ట్ సిటీ ప్లానింగ్ (బిఐఎం, 3డీ ప్లాట్‌ఫారమ్స్)తోపాటు 15 కి పైగా పరిశ్రమలలో 150ం కెరీర్ ఆధారిత స్కిల్ ప్రోగ్రామ్స్‌ను కలిగి ఉన్న సీయూటీఎం, పరిశ్రమల అవసరాలను తీర్చగల నిపుణులను తయారుచేస్తోందని తెలిపారు. 50 పైగా ప్రముఖ సంస్థలతో భాగస్వామ్యంలో ఈ విశ్వవిద్యాలయం గ్లోబల్ స్థాయిలో పోటీపడగల విద్యా ప్రణాళికలను అందిస్తోంది.

## మొట్ట మొదటిసారి డాక్టరేట్ అవార్డు అందుకు న్న జోగింపేట వాసి ముని రామకృష్ణ



**సీతానగరం, జూన్ 22, మేజర్ న్యూస్:** మండలములోని జోగంపేట గ్రామానికి చెందిన ముని రామకృష్ణ ఐఐటీ తిరుపతి విశ్వవిద్యాలయంలో శనివారం నాడు పిహెచ్‌డీ పొందటంతో గ్రామంలో అన్ని వర్గాలవారు ఆయనను అభినందిస్తున్నారు. తమ గ్రామంలో మొదటి పి హెచ్ డీ సాధించిన వ్యక్తిగా డాక్టర్ ముని రామకృష్ణని వారంతా తెలిపారు.విద్య జీవితాలను మార్చగలదని నిరూపించడంలో రామకృష్ణ నిదర్శనమని, తమ గ్రామంలోని చదువుకున్నవారికి ఆయన ఆదర్శమని పలువురు వారిమాటల్లో తెలిపారు.సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన రామకృష్ణ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఉన్నతవిద్యను అభ్యసించే స్థాయికి చేరుకున్నారు .ఉన్నత విద్యాభ్యాసం పూర్తయ్యాక ఆర్ కే వాలీలో త్రిబుల్ ఐటీలో, నూజవిడ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలు అందించి, ప్రస్తుతం ట్రిపుల్ ఐటి శ్రీకాకుళంజిల్లాలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్నారు.రామకృష్ణ తన ప్రయాణంలో వందలమంది విద్యార్థులను వారి లక్ష్యాలను చేరుకోవడంలో సహాయపడటం, వారిని ప్రేరేపించి మార్పు తెచ్చిన వ్యక్తిగా నిలిచారు. రామకృష్ణ అనేక మంది యువతకు, గ్రామంలోనే గాక మండలములో ప్రేరణగా నిలిచారని గ్రామస్తులు తెలిపారు.గ్రామానికి చెందిన పలువురు నాయకులతోపాటు తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ బొమ్మినాయిని లక్ష్మణరావు, టంకల శ్రీనివాసరావులు డాక్టర్ మునిరామకృష్ణను డాక్టరేట్ అవార్డ్ సాధించిన సందర్భంగా ఫోన్లో అభినందించారు. తన పిల్లలు పిల్లలు ప్రశాంత్, మనోహర్లురామకృష్ణ ఉన్నత విద్యాభ్యాసం, ఉన్నత స్థాయిలో ఉండటాన్ని చూసి ఇన్స్పైర్ అయ్యారని, ఆయన సలహాలు, సూచనలతో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని లక్ష్మణరావు తెలిపారు. లక్ష్మణరావు పిహెచ్ డీను తీసుకున్నసందర్భంగా జోగంపేట గ్రామస్తులతో పాటు సీతానగరం మండలంలోని పలువురు అభినందన తెలిపారు

జనం కోసమే
సూర్య
www.suryaa.com
మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే
మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి
చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం
మరింత సమాచారం అందించాల్సిన వారు
ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా
తెలియజేయాలని, ఎల్లవేళా అందుబాటులో
ఉంటామని తెలియజేస్తున్నాం..
బి. శ్రీనివాసరావు
ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్
9110383594

# ఐ టి ఐ లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కై దరఖాస్తులు ఆహ్వానం

### ఐ. టి. ఐ. ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి



**చింతపల్లి, జూన్ 22, మేజర్‌న్యూస్:** చింతపల్లి/అప్పర్ సీలేరు ప్రభుత్వ ఐ టి ఐ లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కై 2వ విడత ప్రవేశం కొరకు ఆన్లైన్లో దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు ప్రభుత్వ.ఐ.టి ఐ. ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి/అప్పర్ సీలేరు ప్రభుత్వ ఐ. టి. ఐ. లో 2025- 2026, అదే విధంగా 2025 - 2027 విద్యా సంవత్సరానికి గాను, వివిధ ట్రేడ్ లలో మిగిలి ఉన్న సీట్లను, భర్తీ చేయుటకు గాను,2వ విడత ప్రవేశం కొరకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు www.iti.ap.gov. in అనే వెబ్సైట్ నందు తమ దరఖాస్తు లను జూలై 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు దగ్గర లోని,ఏదైనా ప్రభు త్వ ఐటిఐ నందు,తమ ఒరిజి నల్ ధ్రువపత్రా లను (సర్టిఫికెట్స్) జూలై 17వ తేదీ లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకుని, వెరిఫికేషన్ పూర్తి చేసు కున్న అభ్యర్థులు జూలై 21వ తేదీన, ఉదయం 10 గంటలకు చింతపల్లి ప్రభుత్వ ఐ టి ఐ. నందు ఒరిజినల్ ధ్రువ పత్రాలతో కౌన్సిలింగ్ నకు హాజరుకావలసి ఉందని ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి తెలియజేశారు. పూర్తి వివరాలు (సమాచారం) కొరకు ప్రభుత్వ ఐటిఐ, చింతపల్లి నందు సంప్రదించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# హేమ్లెట్ గ్రామాలకు ఇంటికి తీసుకువెళ్లి సరుకులు పంపిణీ చేయండి

### : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



**కోటబొమ్మాళి, జూన్ 22, మేజర్‌న్యూస్:** చౌక దుకాణాల నుంచి సరుకుల పంపిణీ చేయడం సత్ఫలితాలు వస్తున్నాయని, కూటమి ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ పునః ప్రారంభించడం ప్రజలు సంతృప్తి చెందుతున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆదివారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో రేషన్ దుకాణాల డీలర్లల అసోషియేషన్ ప్రతినిధులు ప్రభుత్వం పాత విదానం ద్వారా పంపిణీ ప్రవేశపెట్టిన సందర్భంగా వారంతా కలిసి మంత్రిని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కార్డుదారులు ఇబ్బందులు పడ్డారని, ఎండీయూ వాహనం ఎప్పుడు వీధిలోకి వస్తుందో తెలియని పరిస్థితిలో ప్రజలు ఎదురు చూడాల్సి వచ్చేదని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని అన్నారు. లబ్ధిదారులకు 15 రోజులు పాటు సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు ఇస్తాంటూ గత ప్రభుత్వం కొట్లాది ఎండియూ వ్యవస్థను తీసుకువచ్చి నిధులు దుర్వినియోగం చేశారని, దీనికారణంగా ప్రజలు ఇబ్బందులు పడ్డారని అన్నారు. హేమ్లెట్ గ్రామాలకు ఇంటికి తీసుకువెళ్లి సరుకులు పంపిణీ చేయాలని రేషన్ డీలర్లుకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం ప్రతినిధులు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# పి ఎన్ పి ఆగ్రో ఫారెస్ట్రీ చేస్తున్న కృషి ప్రశంసనీయం

### - ఉచిత సిల్వర్ ఓక్ మొక్కల రూపంలో రైతులకు బంగారు భవిష్యత్తు

### - క్లస్టర్ సమన్వయ కర్తలు సూరిబాబు, శంకర్



**చింతపల్లి, జూన్ 22, మేజర్‌న్యూస్:** వ్యవసాయంతో పాటు గిరి రైతులకు అదనపు ఆదాయాన్ని, భూమికి నవ శక్తిని అందించాలనే విశాల దృక్పథంతో సిల్వర్ ఓక్ మొక్కలను ఉచితంగా పంపిణీ చేయడం హర్షణీయమని క్లస్టర్ సమన్వయ కర్తలు గోపినాయక సూరి బాబు, శెట్టి శంకర్ అన్నారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీకి చెందిన కడశిల్ప, బురిసింగి, దేగల పాలెం, మామిడి పల్లి, మూల గొంది గ్రామాలకు పీ ఎన్ పీ ఆగ్రో ఫారెస్ట్రీ వారు ఉచితం గా రైతులకు సిల్వర్ ఓక్ మొక్కలు పంపిణీ చేశారు. పండుగ వాతా వరణంలో జరిగిన ఈ పంపిణీ కార్యక్రమం అన్నదాతల ముఖాల్లో ఆనందం నింపింది. పీఎన్‌పీ ఆగ్రో ఫారెస్ట్రీ సంస్థ తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయంతో రైతుల ముఖంలో నవ్వులు వెల్లివిరిసాయి. వ్యవ సాయం తో పాటు రైతులకు అదనపు ఆదాయం, భూమికి నవశక్తిని అందించాలనే విశాల దృక్పథం తో, ఈ సంస్థ రైతులకు ఉచితంగా సిల్వర్ ఓక్ మొక్కలు పంపిణీ చేసి గిరిజనుల జీవితాల్లో సరికొత్త ఆశలు చిగురింపచేశారు.ఈ మహత్త ర కార్యక్రమం కేవలం మొక్కల పంపిణీ మాత్రమే కాదని రైతుల భవిష్యత్తుకు వేసిన బలమైన పునాదన్నారు. సిల్వర్ ఓక్ మొక్కల వల్ల కలిగే దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజ నాలను, అవి భూసారాన్ని ఎలా పెంపొందిస్తాయో ఈ సందర్భం గా రైతులకు వివరించారు. ఈ మొక్క లు కేవలం ఆదాయ వనరులే కాకుండా, పర్యావరణ సమతుల్య తను కాపాడటం లోనూ, స్వచ్ఛమైన గాలిని అందించడంలో కీలకమని వారు స్పష్టం చేశారు. ఇవి రైతుల పొలంలో పచ్చని బంగారు గనుల వంటివని పేర్కొన్నారు. పీఎన్‌పీ ఆగ్రో ఫారెస్ట్రీ సంస్థ పర్యావరణ పరిరక్షణ పట్ల,రైతుల ఆర్థికాభి వృద్ధి పట్ల తమ నిబద్ధతను మరోసారి చాటు కుందని, సంస్థ చూపిన ఈ అసాధార ణ ఉదారత పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇది మాకు ఊహించ ని వరమని, ఈ మొక్కలు మా భవిష్యత్తుకు భరోసా ఇస్తాయని రైతులన్నారు.పీఎన్‌పీ ఆగ్రో ఫారెస్ట్రీ వంటి సంస్థలు చేస్తున్న ఈ కృషి నిజంగా ప్రశంసనీయ మని, ఇది కేవలం మొక్కల పంపిణీ కాదని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి పోస్తూ, పచ్చని, సుసంపన్నమైన సమాజాన్ని నిర్మించే దిశగా వేసిన విప్లవాత్మక అడుగన్నారు. మరిన్ని సంస్థలకు ఇలాంటి స్ఫూర్తిని అంది పుచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో మహేష్, ఆదినారా యణ, జగన్నాథం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లా సింహాచలంకి ఘన నివాళులర్పించిన దంపతులు



**పెదగంట్యాడ, జూన్ 22, మేజర్‌న్యూస్:** ఇటీవల మరణించిన ప్రముఖ కార్మిక నాయకులు ,మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం పెద్ద కర్మ సందర్భముగా 75వ వార్డు కార్పొరేటర్ దంపతులు పులి లక్ష్మిబాయి, వెంకట రమణా రెడ్డి 75వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం స్మృత్యంజలి ఘటించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ ఆయన గాజువాకలో ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ దంపతులతో పాటు పులి శ్రీరామ రెడ్డి,నీలాపు అప్పల రెడ్డి ,దొమ్మేటి సోము నాయుడు,పులి చిన పెంటయ్య రెడ్డి దొమ్మేటి కనక రాజు, దేముడు,బొడ్డు గిరి,,నవీన్ కుమార్,నీలాపు అప్పల స్వామి, రెడ్డి,మహిళలు పాల్గొన్నారు.

# 4వ అంతస్తు నుండి జారిపడి కార్మికురాలు మృతి

**భీమునిపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** భీమిలి మండలం, దాకమర్రి పంచాయతీ పరిధిలో ఓ ప్రవేట్ కళాశాల లో 4వ అంతస్తు భవనం పై నుండి జారిపడి మహిళ కార్మికురాలు మృతి చెందింది. భీమిలి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా, పాచిపెంట మండలం, పొడుగువలస గ్రామానికి చెందిన టి. శివ, ఆదిలక్ష్మి (35) దంపతులు భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరు దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కళాశాలలో కార్మికులుగా పని చేయటుకు వచ్చారు. శనివారం రాత్రి భార్యాభర్తలు నాలుగు అంతస్తులు భవనంపై నిద్రపోయేందుకు వెళ్లారు. అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో టి. ఆదిలక్ష్మి కాల కృత్యాలు తీర్చుకు నేందుకు మెట్లు దిగుతూ కాలుజారి పడింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయం తగలడంతో మృతి చెందింది. కుమార్డు దుర్గా ప్రసాద్ భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# పేదలపాలిట వరం సీఎం సహాయనిధి

## మంత్రి అచ్చెన్నాయుడు



**కోటబొమ్మాళి, జూన్ 22, మేజర్‌న్యూస్:** వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అభాగ్యులకు ఆపన్నహస్తంలా సీఎం సహాయనిధి మారిందని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన ఆదివారం మండలం నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో 17 మందికి రూ. 12.19.743ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిరుపేదలకు అండగా సీఎం సహాయనిధి కొండత భరోసా కల్పిస్తోందన్నారు. గత ప్రభుత్వం జీఎంఆర్ఎఫ్ నిధులను పక్కదారి పటించారని, గత ముఖ్యమంత్రి పేదలకు వైద్యాన్ని పూర్తిగా దూరం చేశారని, చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎంఆర్ఎఫ్‌ను పునరుద్ధరించారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

**లబ్ధిదారుల వివరాలు:** టెక్కలి నియోజకవర్గం నందిగాం మండలానికి చెందిన బి. జానకిరావుకు రూ.42,708, బి.శకంతులకు రూ. 50,861లు సంతబొమ్మాళి మండాలనికి చెందిన కె.గణేష్‌కు రూ. 72,500, పి.సరస్వతికి రూ. 20వేలు, జె. సావిత్రికు రూ. 52,550, హేమలతకు రూ.87,452 , పి.చిన్నారావుకు 1,09350లు కోటబొమ్మాళి మండలానికి చెందిన ఎం.రాంబాబుకు రూ.51,500, పి.ఆరుంధ్రకు రూ.1,20,000, ఎస్.మోక్షితకు రూ.66,423, కె.మల్లమ్మకు రూ. 45వేలు, యశ్వత్‌కు రూ.41,136, టెక్కలి మండలానికి చెందిన టి.వెంటకరమణకు రూ. 1,13,525, సుజాతకు రూ.2,00,738, ఆర్.కృష్టారావుకు రూ.60వేలు, ఆర్,వెంకటరమణకు రూ.30వేలు , పి.సుశీలకు రూ.40వేలు సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అద్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపీపీ తర్ర రామక్రిష్ణ, నందిగాం మండల పార్టీ అద్యక్షుడు పినకాన అజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# సాఫ్ట్ బాల్‌ను రాష్ట్రస్థాయిలో అభివృద్ధి చేస్తా

## సూర శ్రీనివాసరావు




**శ్రీకాకుళం, జూన్ 22, మేజర్‌న్యూస్:** సాఫ్ట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఉన్న క్రిస్టల్ ప్యాలెస్ లో ఆదివారం రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆమదాలవలస శాసన సభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవి కుమార్ ని రాష్ట్ర అధ్యక్షులు గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గం వివరాలు వైస్ ప్రెసిడెంట్ సి హెచ్ కామేశ్వరి (నెల్లూరు) స్టేట్ సెక్రటరీ సూర శ్రీనివాస్( శ్రీకాకుళం), జాయింట్ సెక్రటరీ ఏ. నాగ రాంప్రసాద్( ఈస్ట్ గోదావరి ), పి సంపత్ రెడ్డి ( గుంటూరు ), సీఈఓ వెంకటేశ్వర్లు ( అనంతపురం ), ఏం వి రమణ కన్వీనర్ (శ్రీకాకుళం )పి. నరసింహ రెడ్డి (గుంటూరు ) ఆర్గనైసింగ్ సెక్రటరీలను ఎన్నుకున్నారు. ఈ ఎలక్షన్ కి ఎలక్షన్స్ ఆఫీసర్ గా రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాధరావు, ఇండియా ఫెడరేషన్ సెక్రటరీ అఫ్ సాఫ్ట్ బాల్ ప్రవీణ్ ఆరోరా సమక్షంలో నిర్వహించారు ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను సాఫ్ట్బాల్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపే ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సాఫ్ట్బాల్ క్రీడకు ఎంతో ఆదరణ ఉందని, భవిష్యత్తులో సాఫ్ట్ బాల్ లో మరిన్ని రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి క్రీడాభివృద్ధికి తోడ్పడతామన్నారు. ఇప్పటికే క్రీడాకారులకు దుస్తులు అందించడంతో పాటు రాష్ట్ర స్థాయిలో వాళ్లు పాల్గొనే పోటీలకు నగదు ప్రోత్సాహం కూడా అందిస్తూ వారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు.

# హెూటల్ మేనేజ్‌మెంట్‌లో అడ్మిషన్లకు చివరి తేదీ జూలై 4

## ఎస్ఐహెచ్ఎం అడ్మిషన్ ఇన్‌ఛార్జ్ కె. శివరామకృష్ణ



**శ్రీకాకుళం , జూన్ 22, మేజర్‌న్యూస్:** బీహెూటల్ నిర్వహణ రంగంలో వృత్తిని ఎంచుకోవాలనుకునే విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరానికి తమ దరఖాస్తులను జూలై 4వ తేదీలోపు కళాశాలకు పంపాలని ఎస్ఐహెచ్ఎం అధికారులు సూచించారు. ఆదివారం విజేత హెూటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలో నడుస్తున్న స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్ (ఎస్ఐహెచ్ఎం) సంస్థలో పలు కోర్సులకు ప్రవేశాలు ప్రారంభమయ్యాయని అడ్మిషన్ ఇన్‌ఛార్జ్ కె. శివరామకృష్ణ, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు విలేఖరుల వెల్లడించారు. ఇంటర్ ఉత్తీర్ణతతో మూడేళ్ల బీఎస్సీ (హెూటల్, హాస్పిటాలిటీ అడ్మినిస్ట్రేషన్) కోర్సు. పదో తరగతి అర్హతతో ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటీసరి, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ కోర్సులు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి రాష్ట్ర పర్యాటక శాఖ హెూటళ్లతో పాటు ప్రముఖ ఫైవ్‌స్టార్ హెూటళ్లలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అధికారులు తెలిపారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని బాలురు, బాలికలకు వేర్వేరు హాస్టల్ సౌకర్యాలు, బ్యాంకు రుణ అవకాశాలు కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు: 9701343846, 9100558006, 9700440604, వెబ్‌సైట్: www.sihmtpt.org, చిరునామా: ఎస్.వి. జూ పార్క్ దగ్గర, ఎస్.వి.ఐ.సి.సి.ఏ.ఆర్ హాస్పిటల్ ఎదురుగా, తిరుపతి వద్ద సంప్రదించవచ్చునని సూచించారు.

# ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం




**విశాఖపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** విశాఖపట్నం పాత నగరంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో గల ఆర్యవైశ్య యువజన సంఘం 2025ు26 సంవత్సరమునకు గాను ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం సాయంత్రం సంఘం భవనం (వాసవి భవన్) లో ఘనంగా జరిగింది. ఇటీవల 2025-26 సంవత్సరానికి గాను జరిగిన ఎన్నికలలో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీ నేతి శ్రీనివాస రావు, కార్యదర్శిగా శ్రీ కట్టమూరి సూర్యనారాయణ, కోశాధికారిగా శ్రీ దుర్గా నూకేశ్వరరావు, మరియు శ్రీ గుండా శ్రీనివాస్ (వర్తక విభాగం) కొల్లూరు సోమేశ్వరరావు (ఉద్యోగ విభాగం) శ్రీమతి దుర్గా శాంతి (మహిళా విభాగం) వైస్ ప్రసిడెంట్స్ గానుబీ జాయింట్ సెక్రటరీలు గా కొత్తా అరుణకుమార్ (వర్తక విభాగం), కల్లూరి సత్తిబాబు (ఉద్యోగ వాభాగం) మరియు శ్రీమతి వంకాయల సృజన (మహిళా విభాగం) మరియు కార్యవర్గ సభ్యులుగా వర్తక విభాగం నుండి 20 మంది, ఉద్యోగ విభాగం నుండి 16 మంది, మహిళావిభాగం నుండి ఆరుగురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ ఎ.వి.ఎస్.ఎన్. గుప్త, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షులు గారు మాట్లాడుతూ 1973లో విశాఖపట్నంలో స్థాపించిన ఆర్యవైశ్య యువజన సంఘం ఆర్యవైశ్యుల అభ్యున్నతికి, పేద వైశ్య విధ్యార్థులకు ఉచిత స్కాలర్షిప్స్ అందించాలని మరియు అన్ని విధాల చేయూత నివ్వాలని, సమాజ లో వివిధ వర్గాలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో స్థాపించిన నాటి నుండి నేటి వరకు అదే స్ఫూర్తితో పనిచేస్తున్నందులకు అభినందనలు తెలిపారు. ఈ సంఘం వారు ప్రతీ సంవత్సరం నిర్వహించే వధూవరుల పరిచయ సభ, పేద విద్యార్థులకు ఇస్తున్న ఉచిత స్కాలర్షిప్స్ వంటి కార్యక్రమాలు పేద మరియు మధ్య తరగతి ఆర్యవైశ్యులకు ఎంతో ఉపయోగకరంగా వుంటుందన్నారు. నూతనంగా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన శ్రీ నేతి శ్రీనివాస రావు మాట్లాడుతూ సుమారు 52 సంవత్సరాల క్రితం ఆర్యవైశ్య కుల పెద్దలు ఏ ఉద్దేశ్యంతో సంఘాన్ని స్థాపించారో ఆ ఉద్దేశం మరింత ముందుకు తీసుకెళ్లాలనే భావనతో కార్యవర్గ సభ్యుల సలహాలు, సహకారంతో సంఘ పురోభివృద్ధికి శాయిశక్తుల పాటు పడతానని అన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

# పల్లా సింహాచలం సంతాప సభలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



**విశాఖపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** కార్మిక బంధు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత మాజీ శాసనసభ్యులు కీర్తిశేషులు శ్రీ పల్లా సింహాచలం గారి సేవలు మరువలేనివని జనసేన విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ వంశీకృష్ణ గారు అన్నారు . నిరంతరం ప్రజా క్షేత్రం లో ఉంటూ , ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన ఉన్నత వ్యక్తిత్వం గల మంచి మనిషి అని కొనియాడారు. యాదవ కుల అభివృద్ధి కొరకు ఎంతో శ్రమించారని గుర్తుచేశారు. సమాజంలో తన లాంటి ఎంతో మందికి ఆదర్శం అని తెలిపారు. టిడిపి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే శ్రీ పల్లా గారితో కలసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, వివిధ పార్టీల ఎమ్మెల్యే లు, రాష్ట్ర వ్యాప్తంగా అశేష జనవాహిని పాల్గొన్నారు.

# సక్రమంగా యోగడేను నిర్వహించని మండల విద్యాశాఖ

## : దేశం నేత చుక్కా రాంబాబు



**కొత్తూరు, జూన్ 22, మేజర్‌న్యూస్:** మండలంలో యోగ దినోత్సవం సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను మండల విద్యాశాఖ పట్టించు కోలేదని దేశం నేత చుక్కా రాంబాబు ఒక ప్రకటన లో ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న నిర్ణయాలు మండల విద్యాశాఖ సక్రమంగా అమలు చేయలేదని రాంబాబు ఆరోపించారు. యోగాలో పాల్గొన్న ప్రతీ విద్యారిదికి అల్పాహారం క్రింద ఎనిమిది రూపాయలు జిల్లా విద్యా శాఖ వెల్లడించిందని ఆయన తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో యోగ దినోత్సవం నిర్వహించగా , ప్రాథమిక పాఠశాలల్లో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు సక్రమంగా అమలు జరగలేదన్నారు. గ్రామాల్లో గల ప్రాథమిక పాఠశాలలో చిన్న చిన్న ర్యాలీ లు నిర్వహించి యోగా పై విద్యార్థులలో అవగాహన కల్పించాల్సి ఉండగా అటువంటి కార్యక్రమాలు విద్యాశాఖ చేపట్టలేదని ఆయనన్నారు. కొన్ని పాఠశాలలో యోగ డే ను తూ తూ మంత్రంగా నిర్వహించి మండల విద్యా శాఖా చేతులు దులుపుకొందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వం లో బాలాదూర్ గా తిరిగే అధికార్లు కూటమి ప్రభుత్వం లో అదేవిధంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొని వస్తున్నారని అన్నారు. భవిష్యత్ లో ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

## కనుగులవలసలో సిసి రోడ్లు ప్రారంభోత్సవం



**ఆమదాలవలస, జూన్ 22, మేజర్‌న్యూస్:** గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మండలం కనుగులవలసలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రహదారులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వీధికి సి సి రోడ్లు, మురుగు కాలువ నిర్మించి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో నియోజకవర్గంలో సిసి రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాల కోసం 338 కోట్ల రూపాయల నిధులను అభివృద్ధి కోసం ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఏడాది పాలనలో ఎన్నో సంక్షేమాలు అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, టిడిపి మండల అధ్యక్షులు నూక రాజు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, నారాయణ పురం ప్రాజెక్ట్ చైర్మన్ సనపల ఢిల్లేశ్వర రావు , టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, బీజేపీ ఇంచార్జి పేడాడ సూరపునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# జనం కోసం రాజకీయాలు చేయాలి

- గత ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తామని మోసం చేశారు
- వచ్చే ఎన్నికల్లో బగ్గు శ్రీనివాస్ పోటీ తప్పనిసరి
- ప్రజా ప్రతినిధులు కార్యకర్తలకు ప్రజలకు అందుబాటులో ఉండాలి

:మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావు



**నరసన్నపేట, జూన్ 22, మేజర్‌న్యూస్:** నరసన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావు ఆదివారం మీడియాతో కాసేపు చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుటుంబం మొదటి నుంచి రాజకీయాలతో సంబంధం కలిగి జిల్లా ప్రజలకు సేవలు అందించామని అన్నారు. ప్రజా ప్రతినిధులుగా తాను, తన తల్లి సరోజనమ్మ వివిధ హోదాలలో ప్రజలకు సేవలందించామన్నారు. సమితి ప్రెసిడెంట్గా, జిల్లా పరిషత్ చైర్మన్ గా, నరసన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఏ పదవిలో ఉన్న గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. తన రాజకీయ జీవితంలో అవినీతి లేని ప్రస్థానం కొనసాగించానని, ప్రత్యర్థి పార్టీల సైతం తన నిజాయితీకి మెచ్చుకున్న సంఘటనలు ఉన్నాయని ఆయన అన్నారు. ప్రస్తుతం వయసు ఎనిమిది పదులకు చేరుకున్న తరుణంలో రాజకీయాలకు దూరంగా ఉన్నానని, తమ కుటుంబం రాజకీయ పరిణితి గల కుటుంబమే అని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. గత ఎన్నికలలో టికెట్ చేజారిపోవడం బాధ కలిగించిందని ఆయన అన్నారు. తన కుమారుడుకు టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు స్వయంగా నియోజకవర్గ టికెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చారని, తరువాత జరిగిన పరిణామాల ఫలితముగా టికెట్ చేజారిపోయిందని ఆయన అన్నారు. తన కుమారుడు వైద్య రంగంలో నిరంతరము సేవలందిస్తూ జిల్లా ప్రజలకు ఆరోగ్య భాగ్యాన్ని కలిగిస్తున్నారని, అటువంటి తరుణంలో ఆనాటి జిల్లా పార్టీ అధ్యక్షులు కూన రవి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చం నాయుడు స్వయంగా తనను కలిసి చంద్రబాబు నరసన్నపేట నియోజకవర్గ టిక్కెట్టు మీకు కేటాయిస్తారని చెప్పి, స్వయంగా చంద్రబాబుతో మాట్లాడించడం జరిగిందని అన్నారు. అనంతరము తాను, తన కుమారుడు బగ్గు శ్రీనివాస్, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చంద్రబాబును కలవడం జరిగిందని, ఎలక్షన్ కు తగ్గట్టు ఏర్పాటు చేసుకోవాలని తమకు చంద్రబాబు సూచించారని, తరువాత జరిగిన పరిణామాలతో పార్టీ అధినేతలో మార్పు వచ్చి వేరొకరికే కేటాయించడం కొంత బాధ కలిగించిన మాట వాస్తవమేనని లక్ష్మణరావు అన్నారు. రానున్న ఎన్నికలలో ప్రజాసేవ చేసేందుకు, ఎన్నికల బరిలో దిగేందుకు తన కుమారుడు బగ్గు శ్రీనివాసరావు ఆసక్తితో ఉన్నారని, నిస్వార్ధ రాజకీయాలు చేయడమే లక్ష్యంతో, అవినీతి రహిత పాలన అందించాలని ఆసక్తితో పోటీకి శ్రీనివాస్ సిద్ధపడుతున్నారని లక్ష్మణరావు అన్నారు. వచ్చే ఎన్నికలలో ప్రజల కోరిక మేరకు తన కుమారుడు బగ్గు శ్రీనివాసరావు రంగంలోకి దిగుతారని, అవినీతి లేని రాజకీయాలు చేయడమే ధ్యేయంగా తమ కుటుంబం పనిచేస్తుందని లక్ష్మణరావు అన్నారు. నియోజకవర్గంలో నేటి పరిస్థితులు పై ఆయన వ్యాఖ్యానిస్తూ అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలకు అన్నివేళలా సేవలందించేందుకు నాయకులు సిద్ధంగా ఉండాలని, పార్టీ కోసం నిరంతరము శ్రమిస్తున్న కార్యకర్తలకు ప్రజా ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని, నేటి పరిస్థితులు దానికి భిన్నంగా కొనసాగుతున్నాయని, వ్యక్తిగత కక్షలతో కొంతమందిని వేధించడం సరికాదని, కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాట వాస్తవమేనని, తన దగ్గరకు కొంతమంది కార్యకర్తలు వచ్చి వారి సమస్యలను తెలియజేస్తున్నారని, నాయకులు ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయాలని, నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, వ్యక్తిగత కక్షలకు దూరంగా ఉండాలని, అవినీతికి దూరంగా ఉండాలని ఆయన హితవు పలికారు. రాజకీయాలలో శాశ్వత మిత్రత్వం శత్రుత్వం ఉండదని, అందరి నాయకులతో తమకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, 8 పదుల వయసులో రాజకీయాలు చేసే ఆలోచన తనకు లేదని, తన కుటుంబం మొదటి నుంచి వ్యవసాయ అనుబంధ రంగాల నుండి స్థిరత్వం కలిగి గ్రామీణ ప్రజల జీవనస్థితిగతులు మెరుగుపరిచేందుకు తగినంత సహాయం చేస్తుందని, రాజకీయాలలో డబ్బులు సంపాదించే ఆలోచన తమకు లేదని, అవినీతి లేని రాజకీయం చేయాలనే లక్ష్యంతో రాబోయే రోజుల్లో తన కుమారుడు శ్రీనివాస్ ముందుకు సాగుతారని ఆయన అన్నారు.

## దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ విస్తరణకు రూ.2000 కోట్ల అమెజాన్ ఇండియా పెట్టుబడి




**విశాఖపట్నం, జూన్ 22, మేజర్‌న్యూస్:** భారతదేశంలో అత్యంత సురక్షితమైన, వేగవంతమైన, అత్యంత విశ్వసనీయ కార్యకలాపాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని, నిర్వహించడానికి తన నిబద్ధతలో భాగంగా, అమెజాన్ 2025లో రూ.2000 కోట్లకు (యూ ఎస్ డీ 233 మిలియన్లు) పైగా పెట్టుబడి పెట్టనుంది. ఈ పెట్టుబడి కార్యకలాపాల మౌలిక సదుపాయాలను విస్తరించడానికి, అప్‌గ్రేడ్ చేయడానికి, భాగస్వాముల భద్రత, సంక్షేమ కార్యక్రమాలను మెరుగుపరచడానికి, తన ఫుల్‌ఫిల్‌మెంట్ నెట్‌వర్క్‌కు కొత్త సాధనాలు, సాంకేతికతను అభివృద్ధి చేసుకునేందుకు వినియోగించనున్నారు. ఈ కొత్త పెట్టుబడి భారతదేశం వ్యాప్తంగా సేవలందించదగిన అన్ని పిన్ కోడ్‌లకు కంపెనీ తన ఉత్పత్తులను అందించడానికి సహాయపడే ఓపీఎస్ నెట్‌వర్క్‌ను సృష్టించడంలో అమెజాన్ పెట్టుబడులపై ఆధారపడి ఉంటుంది.

'భారతదేశంలో ఒక దశాబ్ద కాలంగా, దేశవ్యాప్తంగా ఉన్న మా వినియోగదారులకు భద్రత, వేగం, పరిణామం, విశ్వసనీయతతో అందించేందుకు రూపొందించబడిన అత్యుత్తమ లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను నిర్మించడంపై మేము దృష్టి సారించామని

అమెజాన్ ఇండియా మరియు ఆస్ట్రేలియా ఆపరేషన్స్ ఉపాధ్యక్షుడు అభినవ్ సింగ్ పేర్కొన్నారు.

ఈ తాజా పెట్టుబడులు మా ఫుల్‌ఫిల్‌మెంట్, క్రమబద్ధీకరణ, డెలివరీ నెట్‌వర్క్‌లో మా కార్యకలాపాలను నిరంతరం విస్తరించేందుకు, అప్‌గ్రేడ్ చేయడానికి మా నిబద్ధతను ప్రతిబింబిస్తాయని చెప్పారు. మా మౌలిక సదుపాయాల సామర్థ్యాలను బలోపేతం చేయడం, ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయడం ద్వారా, భారతదేశం వ్యాప్తంగా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు మేము అమెజాన్‌ను తీర్చిదిద్దామని తెలిపారు.

# 14 సెప్టెంబర్‌లో గాండ్ల తెలుకుల రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు



**శ్రీకాకుళం, జూన్ 22, మేజర్‌న్యూస్:** తెలుగు రాష్ట్రాలలో దాదాపు 35 లక్షల జనాభా కలిగిన గాండ్ల తెలుకుల సామాజిక వర్గం సామాజికంగా,రాజకీయంగా వెనకబడి ఉందని,అందుకు మనమంతా సామాజికంగా ఎదిగి .. రాజకీయాల వైపు అడుగులు వేయవలసిన సమయం ఆసన్నమైందని,గడచిన ఎన్నికల్లో గాండ్ల తెలుకుల వారికి అన్ని రకాలుగా ఆదుకుంటామని కూటమి ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు,ఆయన కుమారుడు నారా లోకేష్ అనేక హామీలు ఇచ్చారని,అవి ఇప్పుడు నిలబెట్టుకోవాలని అఖిల గాండ్ల తెలికుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరవ అనంతరం అన్నారు. ఆదివారం శ్రీకాకుళంలో అఖిల గాండ్ల తెలికుల సంఘం సామాజిక భవనంలో గాండ్ల తెలుకుల జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షులు కొమనపల్లి లక్ష్మణ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నరవ అనంతం కుల బంధువులను ఉద్దేశించి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానికి పూర్వం గాండ్ల తెలుకుల సామాజిక వర్గం నువ్వులు,వేరుశనగతో పాటు మరికొన్ని విత్తనాలనుంచి తైలం తీసే వృత్తి చేపట్టి.. గౌరవంగా జీవించే పరిస్థితి ఉండేదని, కర్ర గానుగుల స్థానంలో యాంత్రికరణ చోటు చేసుకోవడంతో పాటు నూనె వ్యాపారాన్ని మార్వాడి వీళ్ళతో పాటు ఇతర సామాజిక వర్గాలు చేపట్టడంతో గాండ్ల తెలుకుల సామాజిక వర్గం పోటీని తట్టుకోలేక ఉపాధిని కోల్పోయి. చివరకు ఇతర పనుల్లోకి వెళ్ళవలసి వచ్చిందని ఆయన వివరించారు. అప్పటినుంచి వెనుక బాటుతనంతోపాటు జరుగుబాటుతనం లేక విద్య, ఉపాధి,ఆర్థిక,సామాజిక,రాజకీయ వెనుకబాటు తనంతో అట్టడుగు వర్గాల వైపు నిర్లక్ష్యానికి గురైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్రం సిద్ధించిన తర్వాత కొన్ని అవమానాలకు.. కొన్ని హేళన లకు గురైన గాండ్ల తెలుకుల సామాజిక వర్గం ప్రజానీకం కొంతమేర రాజకీయ చైతన్యం పొందడమే కాక సామాజికంగా ఎదిగిన పరిస్థితి లేకపోలేదని,అందులో భాగంగా ఏపీసి చెట్టి,డి.వెంకటేశం,బి.గోపాల్ తదితరులు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారని ఆయన గుర్తు చేశారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం, తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఎండీ గా సేవలందించిన సజ్జనార్ తోపాటు బీహార్, రాజస్థాన్,ఒడిస్సా,కర్ణాటక తోపాటు మరికొన్ని రాష్ట్రాలలో గానుగ ద్వారా నూనె తీసి వృత్తి చేపట్టే తేలి,సాహు,గుప్తా తదితర పేర్లతో పిలవబడుతున్న వీళ్లంతా గాండ్ల తెలుకుల వాళ్లేనని ఆయన గుర్తు చేశారు. అయితే వాళ్లంతా ఇతర రాష్ట్రాల్లో సామాజిక న్యాయం తేవడంలో సఫలీకృతులైనరని, మన రాష్ట్రంలో మాత్రం మన సామాజిక వర్గానికి సామాజిక న్యాయం లభించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు గాండ్ల తెలుకుల సామాజిక వర్గం ఒకే తాటిపై నిలిచి .. ఐక్యమత్యంగా ముందుకు సాగితే రాజ్యాధికారంలో భాగస్వామ్యం కలిగి ఉండవచ్చునని, అందుకు మనమంతా కొన్ని త్యాగాలకు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించికొమనాపల్లి లక్ష్మణ ప్రసాద్ మాట్లాడుతూ,గాండ్ల తెలుకుల సామాజిక వర్గం ఆర్థికంగా,రాజకీయంగా ఎంతో ఎత్తుకు ఎదగాలంటే మరింత చైతన్యం కావలసి ఉందని.. అందుకనే ఈ ఏడాది సెప్టెంబర్ 14వ తేదీన రాష్ట్రస్థాయి అఖిల గాండ్ల తెలికుల సంఘం కార్యవర్గ సమావేశాలు శ్రీకాకుళంలోనే నిర్వహించి తలుచుకుందామని,ఇవి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని,అందుకు ప్రతి కుల సభ్యుడు తప్పనిసరిగా కొన్ని బాధ్యతలు తీసుకోవాలని ఆయన కోరారు. మన సామాజిక వర్గంలో పుట్టిన ఎందరో వ్యక్తులు అద్భుతమైన ప్రతిభ పాటవాలు కలిగి ఉన్నప్పటికీ వారు చేరుకోవలసిన చేరుకోలేక పోయినారని,అందుకనే మా సామాజిక వర్గం యువకుల్లో సమాజం కొరకు ఏదో ఒకటి చేయాలన్నా తాపత్రి ఎంతగానో ఉన్నప్పటికీ వారికి తగ్గ ప్రోత్సహం గతంలో లభించలేదని, ఇప్పుడు ఒక యువజన సంఘం ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్ర మధుసూదన్ రా మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దాసరి జ్ఞానమూర్తి,రాష్ట్ర గౌరవ సలహాదారు ఇంజరాపు విశ్వనాథం కెల్లా శ్రీనివాస్,జోన్ వన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రవిచంద్ర,రాష్ట్ర ఉపాధ్యక్షులు కెల్లా ఉమామహేశ్వరరావు,ట్రెజరర్ కల్లేపల్లి జగన్, జిల్లా మహిళా కన్వీనర్ కె.విజయ,యువజన సంఘం నూతన అధ్యక్షులు తెలికుల మన్మధ,జిల్లా ఉపాధ్యక్షులు గణేష్ సాహు,జిల్లా ఉపాధ్యక్షులు తలగాపు కామేశ్వరరావు,రాష్ట్ర సంఘం మాజీ డైరెక్టర్ ఎండపల్లి ఈశ్వరరావు,రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు,పి గోపి, గండేపల్లి శ్రీనివాస్,కల్లేపల్లి శ్రీనివాస్, తెలుకుల సురేష్,వెంకటరామరాజు,బాలు, కెల్లా త్రినాథ్,అంబటి శ్రీనివాస్,జామన సాయిరాజ్,తలగాపు వెంకటరమణ తోపాటు జిల్లా నలుమూల నుంచి కార్యవర్గ సభ్యులు, పెద్దలు,మహిళలు,యువత పాల్గొన్నారు.

# మనం సంపాదించే జ్ఞానం మనలో సంస్కారాన్ని నింపాలి

### సుపధ ఆశ్రమ నిర్వాహకులు శ్రీహరిశర్మ



**లక్కవరపుకోట, జూన్ 22, మేజర్ న్యూస్:** మనం నిత్యజీవితంలో వివిధ రూపాల్లో ఆర్జించే జ్ఞానం మన జీవితాన్ని సంస్కారవంతమైన విధానంలో నడిపించేదిగా ఉండాలని అప్పుడే ఆ జ్ఞానానికి విలువ పరిపూర్ణత లభిస్తుందని నమస్కారం ఇవ్వని జ్ఞానం విషతుల్యమని అది మన జీవితాన్ని అంచెలుగా నాశనం చేస్తుందని సుపద ఆశ్రమ నిర్వాహకులు వేద పండితులు అక్కా జోసుల శ్రీహరి శర్మ అన్నారు మండల కేంద్రంలోని ఆశ్రమంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఆదివారం పాఠశాలలో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు విషయాలను బోధిస్తున్నారు శనివారం నిర్వహించిన పాఠశాలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనగా భారతీయ సనాతన ధర్మ విశేషాలు వివరిస్తూ ప్రపంచ యోగా ఎందుకు నిర్వహించారు అనేది తెలియజేస్తూ ఆయన విద్యార్థులకు ధర్మ గ్రంథాలు ఏమి బోధిస్తున్నాయి వివరించే ప్రయత్నం చేశారు ఈ భూమిపై మనిషిగా జన్మించడం ఒక గొప్ప వరం అయితే మంచి జీవన విధానం అలవర్చుకోకుండా జీవించడం అనేది ఎంతో పాప భూయిష్టమైనదని అలా ఎవరైతే జీవిస్తారో వారు మానవజన్మకు అర్హులు గారిని ఇతర జీవుల కంటే శ్రేష్టమైన జీవిగా మానవుడు జీవించే అవకాశం ఉందని అలా శ్రేష్టంగా జీవించేందుకు ప్రయత్నించిన నాడే మనిషికి జంతువుకు ఇతర జీవులకు తేడా మనం స్పష్టంగా తెలుసుకోగలమని అటువంటి జీవితాన్ని గడిపేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ఆయన హితబోధ చేశారు మనం ఎక్కడ పుట్టామనేది ముఖ్యం కాదని పుట్టుక అనంతరం మనం సాగిస్తున్న జీవన విధానం యొక్క ఆధారాన్ని బట్టి మన అర్హత నిర్ణయించబడుతుందని పుట్టుకను తలుచుకుని బాధపడవద్దని మన బ్రతుకును ధర్మబద్ధంగా బ్రతికేందుకు ప్రయత్నించాలని అప్పుడు భగవంతుడు దృష్టిలో నువ్వు ఉన్నతుడిగా చూడబడతావని సత్యాన్ని తెలుసుకోవాలని అన్నారు ఎంత ధనం సంపాదించావు ఎంత పెద్ద పదవిలో ఉన్నావు అనే దాన్ని బట్టి వచ్చే గౌరవం కంటే నీది నా నువ్వు సంపాదించిన జ్ఞానం ఎంత ఆ జ్ఞానం తో నువ్వు ఎంత నీతివంతంగా బ్రతుకుతున్నావు అనే దాన్ని బట్టి వచ్చే గౌరవం గొప్పదని ఇది ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు పొగడ్తలకు పొంగిపోవద్దని ఎంత ఆశ చూపించినా అధర్మ మార్గాన్ని ఎంచుకోవద్దని అవన్నీ శాశ్వతం కాదని పుణ్యం దైవానుగ్రహం ఇవే శాస్త్రమని ఇవే నీ జీవితాన్ని నీ భవిష్యత్తును నిర్ణయిస్తాయని ఆయన తెలిపారు మొక్కై వంగనిది మానై వంగదని అందరికీ తెలుసు కనుక అంటే విద్యార్థి దశ నుంచే సద్గుణాలను సన్మార్గాన్ని పిల్లలలో నింపేందుకు తల్లిదండ్రులు ప్రయత్నం చేయాలని తల్లిదండ్రులే మొదటి గురువులు కనుక మీ ప్రవర్తన బాగుంటే అధిక శాతం మీ పిల్లల ప్రవర్తన కూడా బాగుంటుందని ఎవరో ఎక్కడో గాడిత ప్పి ఉండవచ్చు తప్పితే ఎక్కువ శాతం తల్లిదండ్రుల ప్రవర్తన ఆధారంగా పిల్లల ప్రవర్తన ఉంటుందని ఆయన అన్నారు నేటి తరం పిల్లల ప్రవర్తన పై తల్లిదండ్రుల ఆందోళన చెందుతున్నారని ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది కనుక సమస్య ఎక్కడ ఎందుకు పుట్టింది కనిపెట్టే ప్రయత్నం చేయాలని ఇప్పుడు పిల్లల్లో కూడా మార్పును తీసుకురావడం సులభం అవుతుంది అన్నారు అందుకే ఇటువంటి ధార్మిక కార్యక్రమాలకు ప్రత్యేక తరగతులకు మాలాంటి గురువులు వద్దకు పంపితే జ్ఞానంతో పాటు సంస్కారాన్ని నింపే ప్రయత్నం చేస్తామని సుపద ఆశ్రమం ఈ విషయంలో అందరికంటే ముందుంటుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెంటపల్లి వాసు వెంకటరావు మాస్టర్ విద్యార్థులు సంఘం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ అభివృద్ధికి ఢిల్లేశ్వరరావు సేవలు వెలకట్టలేనివి

### యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపత్ రావు కిషోర్



**పలాస, జూన్ 22, మేజర్‌న్యూస్:** విద్యారంగ అభివృద్ధికి ఢిల్లేశ్వరరావు మాస్టర్ సేవలు వెలకట్టలేనివి అని,నాలుగు దశాబ్దాలకు పైగా విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో విశేషంగా కృషి చేశారని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపత్ రావు కిషోర్ అన్నారు.ఆదివారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ప్రేమించాలని బడుగు బలహీన వర్గాలు విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో 36 ఏళ్ళుగా పని చేస్తూ ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్ది ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మాస్టర్ లఖినాన డిల్లేశ్వరరావు అని అన్నారు.పాఠశాలలను బలోపేతం చేయడం,విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తి డిల్లేశ్వరరావు మాస్టర్ అని కొనియాడారు.ఏ పాఠశాలలో పని చేసిన అంకిత భావంతో పని చేసేవారని, ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సర్వసాధారణమని విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపుగా నిలుస్తాయని అన్నారు. అనంతరం లఖినాన డిల్లేశ్వరరావు మాట్లాడుతూ తాను ఉద్యోగ విరమణ చేసిన విద్యార్థులకు తన వంతుగా విద్యను అందించి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేయడమే కాకుండా యూటిఎఫ్ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.అనంతరం ఢిల్లేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలాస మండల విద్యాశాఖ అధికారి సి హెచ్ శ్రీనివాసరావు,యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబురావు,ఎల్.వి.చలం,సీనియర్ నాయకులు బోడ్డేపల్లి మోహన్ రావు,కె. దాలయ్య,బల్ల చిట్టిబాబు,పలాస మండల శాఖ అధ్యక్షులు టి.జయరాం,ఎస్.వి.రమణ, తమ్మినాన ఎర్రన్న,ఉప్పాడ రమేష్,ఎస్ మోహన్ రావు,కె.ప్రసాద్ రావు,గున్న మధుసూదన రావు,కంచరాన ప్రసాదరావు, గుంట కోదండరావు,కంచరాన.జయరాం,కంచరాన రమేష్,జి. నాగేశ్వర రావు, చందు,బెండి లక్ష్మి,గొండు మధు, ఎస్.వెంకటరమణ, పురు షోత్తం, భానుమతి, మోహన్ రావు, ఎన్.వి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి!



**ఆమదాలవలస, జూన్ 22, మేజర్‌న్యూస్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించే యువతపోరు కార్యక్రమంలో యువత పాల్గొని విజయవంతం చేయాలని ఆమదాలవలస నియోజకవర్గ వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. ఆమదాలవలస నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గ యువజన విభాగం నాయకులతో ఆదివారం కార్యక్రమం యొక్క సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం యువతకు 20 లక్షల ఉద్యోగాలు కలిపిస్తాం, అంతవరకు ఒక్కొక్కరికి నెలకు రూ. 3000 నిరుద్యోగ భృతి ఇస్తాం అని నమ్మపలికి, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత యువతకు నిరుద్యోగ భృతి ఇచ్చేదిలేదు లేదు అని చంద్రబాబు అనడం యువతను మోసం చేయడమే అని అన్నారు. జిల్లాలో యువతపోరు కార్యక్రమానికి యువకులు ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం కలెక్టర్ ఆఫీస్ దరిలో గల జ్యోతిరావు పూలే విగ్రహం వద్దకు చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొందూరు మండల వైస్ ఎంపీపీ ప్రతినిధి వండాన సూరపునాయుడు, వైసీపీ జిల్లా ఇంటెలెక్టుయల్ విభాగం అధ్యక్షులు కొప్పల ఈశ్వరరావు, వైసీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు బట్న సత్యన్నారాయణ, సరుబుజ్జిలి మాజీ జెసిఎస్ కన్వీనర్ అత్తులూరి రవికాంత్, వైసీపీ నియోజకవర్గ డాక్టర్స్ విభాగం అధ్యక్షులు దానేటి రామ్మోహన్, ఆమదాలవలస నియోజకవర్గ నాలుగు మండలాలు, మున్సిపాలిటీ యువజన విద్యార్థి విభాగం నాయకులు, సరుబుజ్జిలి సర్పంచ్ బొడ్డేపల్లి హరి, దన్నాన అజయ్ కుమార్, మామిడి శ్రీనివాస రావు, కిరణ్ కుమార్, హేమంత్ కుమార్, బస్వా అనంత్, దేవకోట ఈశ్వర రావు, బండి మహేష్, బలరాం,లోకేష్,ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల వికాసానికి రాచబాటలు

### రూ.8.85 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
### - నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు
### రూ.600 కోట్లతో ఇంటింటికీ స్వచ్ఛమైన నీరు



**నందిగాం, జూన్ 22, మేజర్‌న్యూస్:** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి నియోజకవర్గం నందిగాం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. బైక్ ర్యాలీగా గ్రామాల్లోకి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెంటూరు గ్రామంలో సీసీ రహదారి, పోల్లాడ రోడ్డు, కోటిపల్లి వద్ద రౌతుపురం రహదారి, బంజీరుపేట, సైలాడ, డబ్బలపాడు, శివరాంపురం వద్ద రోడ్లకు శంకుస్థాపన చేశారు. కొటియాకొండపేట వద్ద బిటి రహదారికి శ్రీకారం చుట్టారు. మొత్తం రూ.8.85 కోట్ల వ్యయంతో రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రజల అవసరాలే ప్రభుత్వానికి మార్గదర్శకాలుగా మారుమూల గ్రామాలకు రాకపోకలు సమస్యలేకుండా రహదారులు వేస్తున్నామన్నారు. నియోజక వర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.600 కోట్లతో ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తల్లికి వందనం పథకం కింద కుటుంబంలోని చదువుకున్న ప్రతి పిల్లకు తల్లి ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. భర్త చనిపోయిన వితంతులకు విడో పింఛన్లను అందించనున్నట్లు తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడు పర్యటనతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రజలు మంత్రికి బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎ.సూర్య ప్రకాష్, డి ఈ ఎం.సుధాకర్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఎస్.రామకృష్ణ, ఎం పి డి ఓ కుమార్ పట్నాయక్ ,ఇన్చార్జి తహసీల్దార్ రామారావు, ఈవోపీఆర్డీ తులా రాజారావు, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రావు, తదితరులు, పాల్గొన్నారు.

## అసరవల్లి దేవస్థానం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తయారు చేయండి

### : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



**కోటబొమ్మాళి, జూన్ 22, మేజర్‌న్యూస్:** అసరవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అదికారులను ఆదేశించారు. అసరవల్లి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.ఎన్.వి.డి.వి. ప్రసాదరావు నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు పలు సూచనలు చేశారు. భక్తలకు అసౌకర్యం కలగ కుండా స్వామిదర్శినం కల్పించాలని సూచించారు. దేవాలయం అభివృద్ధిపై త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందుకు అవసరమైన అభివృద్ధికి, సమగ్ర నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.